

తిరుపతి హక్కు

35 ఏళ్ల డిమాండ్ మళ్లీ తెరమీదకు వచ్చింది. తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలంటూ బలమైన స్వరం వినిపిస్తోంది. 'బాలాజీ డివిజన్ మన హక్కు' అనే నినాదం హోరెత్తుతోంది. సాధించుకోవడానికి చేతులు కలుపుతున్నారు. విభిన్న రంగాల ప్రజలను చైతన్యపరుస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుప్పాల గిరిధర్ కుమార్ కన్వీనర్‌గా ఎం.వేణుగోపాల రెడ్డి, సూరినేని బుజ్జిబాబు నాయుడు,వైఎస్ బాబు, సి.కృష్ణయ్య తదితరులు సభ్యులుగా బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితిని ఏర్పాటు చేశారు. డివిజన్ అవసరాన్ని వివరిస్తూ సెప్టెంబరు 12న తిరుపతిలో సదస్సు నిర్వహించారు.నవంబర్ 16న తిరుపతిలోని ప్రముఖులతో సన్నాహక సమావేశం జరిగింది. ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిసి బాలాజీ డివిజన్ సాధనకు సహకరించమంటూ వినతులు ఇస్తున్నారు. రానున్న రోజుల్లో ఉద్యమరూపం తీసుకోవాలని భావిస్తున్నారు.



బాలాజీ రైల్వే డివిజన్





తిరుపతి- ఆంధ్రజ్యోతి

ప్రస్తుతం దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) జోన్‌లోని గుంతకల్ రైల్వే డివిజన్లో తిరుపతి ఉంది. ఇక్కడికి గుంతకల్లు 320 కిలోమీటర్ల దూరం. కొత్తగా ఏర్పడుతున్న విశాఖపట్టణం జోనల్ కార్యాలయం తిరుపతికి 736 కిమీ దూరంలో ఉంది. ఇందువల్ల పాలనాపరమైన ఇబ్బందులు ఎక్కువ. సంవత్సరానికి రూ250 కోట్ల ఆదాయంగల ఏ1 కేటగిరీ స్టేషన్ ఉన్న తిరుపతి ప్రాంతం తీవ్రంగా నష్టపోతోంది. వివక్షకు గురవుతోంది. రైల్వేల పరంగా అభివృద్ధికి అవకాశం లేకుండా పోతోంది. ఈ కారణాలతో బాలాజీ రైల్వే డివిజన్ ఆలోచన 1990లో పురుడుపోసుకుంది. ఇదొక డిమాండ్‌గా అప్పటి నుంచీ వినిపిస్తూనే ఉంది. 2003లో సాకారం అయ్యే పరిస్థితి కనిపించినా దానిని దారిమళ్లించారు. గుంటూరు డివిజన్ ఏర్పడింది. ఇప్పటికే విజయవాడ డివిజన్‌కేంద్రంగా ఉంది. ఈ రెండు డివిజన్ల మధ్య దూరం 30 కిలోమీటర్లు మాత్రమే. అయినా తిరుపతి ప్రాంతానికి అన్యాయం జరిగింది. బాలాజీ డివిజన్ అన్నది బలమైన రాజకీయ డిమాండ్‌గా మారకపోవడమే ఇందుకు కారణం. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ఈ ప్రాంత నాయకులు బాలాజీ డివిజన్ సాధించే దిశగా గట్టి ప్రయత్నాలు చేయలేదు. విశాఖ జోనల్ కార్యాలయంతో పాటూ తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్ ఏర్పడితే దక్షిణాంధ్ర అభివృద్ధిపై సమాన దృష్టిని కేంద్రీకరించినట్టు అవుతుంది.

మనకింత నష్టమా!

- తిరుపతి రైల్వే స్టేషన్ ద్వారా వచ్చే వందల కోట్ల ఆదాయంలో అత్యధికం ఇతర డివిజన్‌ల అభివృద్ధికి మళ్లిపోతోంది. ఇందువల్ల తిరుపతి స్టేషన్‌లోనూ, ఈ ప్రాంతోని ఇతర స్టేషన్లలోనూ అవసరమైన ప్లాట్‌ఫారమ్ విస్తరణ, పార్కింగ్, లిఫ్టులు, ప్రయాణీకులకు సౌకర్యాలు వంటి ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి.
- రైల్వే శాఖ ఇప్పటికే చేపట్టిన తిరుపతి- తిరుచానూరు-చంద్రగిరి అభివృద్ధి ప్రణాళికలు, తిరుపతి -గూడూరు డబుల్ లైన్, తిరుపతి-కాట్పాడి ఎలక్ట్రిఫికేషన్ వంటివి నెమ్మదిగా సాగుతున్నాయి. సొంత డివిజన్ ఉండివుంటే ఇవి వేగంగా పూర్తయ్యేవి.
- ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలు రైల్వేల పరంగా వెనుకపడ్డాయి. కొత్త ప్రాజెక్టులు, అదనపు రైళ్లు, లేదా టూరిస్టు రూట్లు అనుమతించాల్సినప్పుడు తగిన ప్రాధాన్యం లభించడం లేదు.

డివిజన్ వస్తే ఇవీ ప్రయోజనాలు

ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తిరుపతిని చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలతో అనుసంధానించడానికి విస్తృత రైల్వే నెట్‌వర్క్ ఉంది. ప్రత్యేక డివిజన్ ఏర్పాటుతో ఈ ప్రాంత రైల్వే వ్యవస్థ బలపడడంతోపాటూ, వాణిజ్యం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

- డివిజన్ ఏర్పడితే 10వేల మందికి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుంది. రైల్వే కార్యాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ విభాగాలు, కంట్రోల్ రూమ్‌లు, పరిపాలన సిబ్బంది, మెయింటనెన్స్, సెక్యూరిటీ, క్లీనింగ్, సిగ్నలింగ్, కేటరింగ్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. డివిజన్ ఏర్పడితే స్థానిక ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.రైల్వే డివిజన్ ఉన్న నగరాలలో సగటున 500నుంచి వెయ్యి గెజిటెడ్ మరియు నాన్ గెజిటెడ్ పోస్టులు ఉంటాయి. ఇవన్నీ ఈ ప్రాంతం వారి అవకాశాలను మెరుగుపరుస్తాయి.
- రైల్వే డివిజన్ ఏర్పాటు ఈ ప్రాంతానికి ప్రయాణాన్ని సులభతరం చేస్తుంది, తద్వారా ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో బాలాజీ డివిజన్ కీలక పాత్ర పోషిస్తుంది.
- రైళ్ల రాకపోకలు పెరుగుతాయి. సరుకు రవాణా నిర్వహణ, సేవల నాణ్యత పెరుగుతుంది.
- ప్రభుత్వ పెట్టుబడులు, రైల్వే మౌలిక సదుపాయాలు స్థానిక వ్యాపారాలను, స్థానికులకు ఉపాధిని పెంచుతాయి.
- కృష్ణపట్నం, రాబోయే రామాయపట్నం, దుగరాజపట్నం పోర్టులకు మెరుగైన కనెక్టివిటీ సౌకర్యం ఏర్పడుతుంది.
- ప్రధాన కార్యాలయం చుట్టూ పౌర మౌలిక సదుపాయాలు, రోడ్లు, రైల్వే కాలనీలు అభివృద్ధి చెందుతాయి.
- డబ్లింగ్, విద్యుదీకరణ, స్టేషన్ అప్‌గ్రేడేషన్, పర్యాటక హబ్ వంటి కొత్త ప్రాజెక్టులకు అవకాశం ఉంటుంది.
- తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలకు మరిన్ని సదుపాయాలు, వెసులుబాటు వసతులు, ఫైట్ హ్యాండ్లింగ్ సౌకర్యాలు వస్తాయి.

గూడూరు డివిజన్‌లోకి ఆ 3 మండలాలు

- నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం
- అభ్యంతరాలు, సూచనలకు నెల రోజుల గడువు

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఉన్న కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు సందర్భంలో వెంకటగిరి నియోజకవర్గాన్ని నెల్లూరు, తిరుపతి జిల్లాల నడుమ విభజించిన సంగతి తెలిసిందే. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లాలో చేరగా మిగిలిన కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరు జిల్లాలోనే కొనసాగుతున్నాయి. పాలనాపరంగా ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం నెల్లూరు పరిధిలోని మూడు మండలాలను కూడా తిరుపతి జిల్లాలో కలపాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లోని కలువాయి.. నెల్లూరు రెవెన్యూ డివిజన్‌లో ఉన్న సైదాపురం, రాపూరు మండలాలను గూడూరు రెవెన్యూ డివిజన్‌లో చేర్చేందుకు గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ ప్రిలిమినరీ నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిపై ఆ మూడు మండలాలతో పాటు జిల్లాకు చెందిన ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలుంటే తెలపాలని ఆహ్వానించారు. అందుకు నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి నెల రోజులు గడువిచ్చారు.

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచిత శిక్షణ

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్ ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖాధికారి భరత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిసెంబరు 3వ తేదీలోపు కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ ఆఫీ‌సులో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94414 56039 నెంబరులో సంప్రదించాలన్నారు.

5న మెగా పీటీఎం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డిసెంబరు 5న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఆదేశించారు. గతేడాది లాగే మెగా పీటీఎం 3.0 కార్యక్రమాన్ని ఉత్సాహంగా, బాధ్యతగా నిర్వహించాలని సూచించారు.

ఈ దాష్టీకం ఎవరి పని?

- పుల్లారెడ్డికండ్రిగలో వృద్ధ దంపతులపై కత్తులతో దాడి
- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు


బెడ్‌పై జయమ్మ మృతదేహం


జయమ్మ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దోపిడీకొచ్చారా? లేదా ఇతర వివాదాలున్నాయా? ఆ వృద్ధ దంపతులపై కత్తులతో దాడి చేయాల్సిన అవసరం ఎవరికి ఉంది? ఇదీ శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డికండ్రిగలో బుధవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి తలెత్తిన ప్రశ్నలు. చెవిరెడ్డి మహదేవరెడ్డి, జయమ్మ(75) దంపతులపై దాడిలో భార్య మృతిచెందగా భర్తకు తీవ్రగాయాలయ్యాయి. చెవిరెడ్డి మహదేవరెడ్డి పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంగా స్వచ్ఛంద విరమణ చేశారు. అదే సమయంలో శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలను కొందరు సన్నిహిత వ్యక్తులతో కలిసి నిర్వహించేవారు. వీరి పెద్దకుమారుడు పెద్దకుమారుడు యుగంధర్‌రెడ్డి హైదరాబాద్‌లో పారిశ్రామికవేత్త. చిన్నకుమారుడు మధుసూదన్‌రెడ్డికి శ్రీకాళహస్తిలో పాఠశాల, డిగ్రీ కళాశాల ఉంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. శ్రీకాళహస్తి మండల వైసీపీ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికయ్యారు. పుల్లారెడ్డి కండ్రిగలో రెండేళ్ల కిందట డూప్లెక్స్ భవన నిర్మాణం చేపట్టారు. ఉత్తరాది వలస కార్మికుల చేత పనులు చేపట్టారు. మధ్యలో వారు వెళ్లిపోవడంతో శ్రీకాళహస్తి బిల్డర్ ఆరునెలల కిందట నిర్మాణం పూర్తి చేశారు. ఈ ఇంట్లోనే మహదేవరెడ్డి, జయమ్మ దంపతులు ఉంటున్నారు. ఎన్నో ఏళ్లుగా వీరి మామిడితోటకు గిరిజన మహిళ సుబ్బరత్న కాపలాగా ఉంటూ, ఇంటి పనులూ చూసుకునేవారు. గత పంచాయతీ ఎన్నికల్లో ఆమె సర్పంచిగా ఏకగ్రీవ ఎన్నికయ్యారు. అయినా, పనిమనిషిగా ఉంటున్నారామె.

ఇంట్లోకి ఎలా వెళ్లారంటే..


పగలగొట్టిన కిటికీని పరిశీలిస్తున్న క్లూస్ టీం

ఇంటి ఆవరణలోని వాషింగ్ మిషన్ గదిలోకి వెళ్లి.. దానిపై నుంచి వంట గది కిటికీలు పగలగొట్టి లోపలకు దుండగులు ప్రవేశించినట్లు అక్కడి పరిస్థితిని బట్టి తెలుస్తోంది. ఆ దంపతులపై కత్తులతో దాడి చేశారు. తాము తిరిగిన ప్రదేశాల్లో దుండగులు కారపు పొడి చల్లినట్లు పోలీసులు గుర్తించారు.

హత్య వెలుగు చూసిందిలా..

గురువారం ఉదయం 7గంటల సమయంలో పాలు తీసుకుని సుబ్బరత్న వచ్చి తలుపు కొట్టినా అలికిడి లేదు. ఇరుగు పొరుగు వారికి చెప్పడంతో వాళ్లూ వచ్చి తలుపు కొట్టారు. నెత్తుటి గాయాలతో రోదిస్తూ మహదేవరెడ్డి వచ్చి తలుపు తీశారు. లోపల బెడ్‌పై విగతజీవిగా జయమ్మ పడున్నారు. దీంతో బుధవారం రాత్రి జరిగిన ఈ దాడి ఘటన వెలుగులోకి వచ్చింది. శ్రీకాళహస్తి నుంచి వీరి కుమారుడు మధుసూదన్‌రెడ్డికి గ్రామానికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి ఏఎస్పీ రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మహదేవరెడ్డిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇంటి నుంచి ఎదురుగా ఉన్న పంట పొలాల మీదుగా నాగాలమ్మ చెట్టు వరకు పోలీసు జాగిలం వెళ్లి నిలిచిపోయింది. క్లూస్‌టీం బృందం వేలిముద్రలు సేకరించారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఆ కుటుంబాన్ని పరామర్శించారు. హంతకులను త్వరగా గుర్తించి శిక్షించాలని అధికారులను కోరారు.


సుబ్బరత్నను ఆరా తీస్తున్న ఏఎస్పీ


చికిత్స పొందుతున్న మహదేవరెడ్డి

అంతుచిక్కని ప్రశ్నలెన్నో?

- తమ పక్కపొలం అతను ఇంట్లోకి ప్రవేశించి దాడికి పాల్పడినట్లు చికిత్స పొందుతున్న మహదేవరెడ్డి పోలీసులకు చెప్పారు. వయసు మీద పడటం, కరోనా నుంచి ఆయన పొంతన లేని మాటలు చెబుతున్నారని కుటుంబీకులు అధికారులకు వివరించారు.
- రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసే మధుసూదన్‌రెడ్డికి కొందరితో భూవివాదాలు ఉన్నాయి. అయితే హత్యకు పాల్పడే తీవ్రస్థాయి విబేధాల్లేవని కుటుంబ సభ్యులు పోలీసులకు చెప్పారు.
- వీరి ఇంటి వద్దకు రాకపోకలు సాగించేవారు ఎవరైనా ఇలాంటి దురాగతానికి పాల్పడ్డారా అనే కోణంలో పలువురు అనుమానితులను ఆరా తీస్తున్నారు.

ఆ ముఠా పనేనా?

దొంగతనం కోసమైతే హత్యలు చేసిన ఘటనలు ఇటీవల శ్రీకాళహస్తి ప్రాంతంలో లేవు. దీనికైతే మారుమూల గ్రామమైన పుల్లారెడ్డికండ్రిగకు వెళ్లి.. వృద్ధ దంపతులున్న ఇంటిని ఎందుకు ఎంపిక చేసుకున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఇక, జయమ్మ మెడలోని బంగారు గొలుసు కనిపించలేదని సమాచారం. కమ్మలు ఉన్నాయి. కాగా, జూలై 22న నాగలాపురం వద్ద దుండగులు బంగారు చైను కోసం మహిళను హతమార్చారు. ఇప్పటికీ ఆ కేసు మిస్టరీ వీడలేదు. ఇదీ ఆ ముఠా పనేనా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

రోడ్ల అభివృద్ధికి రూ.15.20కోట్లు

- నెలాఖరుకు రానున్న మరో రూ.16కోట్లు



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రోడ్ల అతీగతి పట్టించుకోలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించింది. ఏడు రోడ్లకుగాను రూ.15.20 కోట్లు మంజూరైనట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం తెలిపారు. ప్రధానంగా నాగలాపురం-చిన్నపాండూరు రహదారి అభివృద్ధికి రూ.11 కోట్లు కేటాయించింది. సూళ్ళూరుపేట-సంతవేలూరు రోడ్డుకు రూ.75లక్షలు, శ్రీకాళహస్తి-ముసలిపేడు రోడ్డుకు రూ.40లక్షలు, శ్రీకాళహస్తి-కాసరం- గొల్లగుంట రోడ్డుకు రూ.36లక్షలు, ఈదులపల్లి-వీరంపల్లి రోడ్డుకు రూ.2కోట్లు, గూడూరు-తురిమెల్ల రోడ్డుకు రూ.30లక్షలు వంతున మంజూరుచేసింది. ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.15.20కోట్లతో సుమారు 40 కిలోమీటర్ల మేరకు రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఈఈ రాజా నాయక్ తెలిపారు. ఈపనులకు త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. నెలాఖరు లోగా మరిన్ని రోడ్లు అభివృద్ధి చేయడానికి మరో రూ.16కోట్లు మంజూరు కానున్నాయని కలెక్టర్ తెలిపారు.

తిరుపతి సమీపంలో 600 ఎకరాల్లో దార్మిక టౌన్‌షిప్‌కు సహకరించండి!

రెవెన్యూ మంత్రికి డెల్లా గ్రూప్ ప్రతినిధుల వినతి

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సమీపంలో 600 ఎకరాల్లో ధార్మిక టౌన్‌షిప్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచీ సహాయ సహకారాలు అందించాలని డెల్లా గ్రూప్ ప్రతినిధులు గురువారం రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. అమరావతిలో మంత్రిని కలసిన గ్రూప్ ప్రతినిధులు తమ సంస్థ తిరుపతి విమానాశ్రయానికి సమీపంలో 600 ఎకరాల భూమి సేకరించిందని, అందులో ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా ధార్మిక టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వసుధైక కుటుంబం పేరుతో విమానాశ్రయానికి చేరువలో చేపట్టే అంతర్జాతీయ ప్రాజెక్టు భూమితో సహా మొత్తం ప్రైవేటుదేనని వివరించారు. అయితే దీనికి ప్రభుత్వం నుంచీ అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అభ్యర్థించారు. హిందూమతంపై ప్రపంచంలోనే మొట్టమొదటి ఎగ్జిబిషన్, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ఆతిథ్యం, మెడికల్ వెల్‌నెస్ సెంటర్లు, అడ్వంచర్ పార్కులు, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లు, అత్యున్నత రియల్ ఎస్టేట్ తదితర అంశాలను మేళవిస్తున్నామని వెల్లడించారు. దాదాపు రూ. 3 వేల కోట్ల విలువైన ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను వేగంగా ఇచ్చి, త్వరగా పనులు పూర్తయ్యేందుకు సహకరించాలని మంత్రిని కోరారు. డెల్లా గ్రూప్ ప్రతినిధుల ప్రతిపాదనపట్ల రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ సానుకూలంగా స్పందించారు.ఇప్పటికే వివిధ దేశాల నుంచీ భక్తులు వస్తున్న తిరుపతిలో ఇలాంటి ప్రాజెక్టు ఏర్పాటైతే మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. డెల్లా గ్రూప్ ప్రతిపాదనల గురించి కలెక్టర్‌ను సంప్రదించగా గ్రూప్ ప్రతినిధులు మొదటిసారిగా జిల్లా ఇంచార్జి మంత్రిని గురువారమే కలిసినట్టు వుందన్నారు. దానిపై మంత్రి పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశముందన్నారు. ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్నాక తమకు సమాచారం వచ్చే అవకాశముందన్నారు. ప్రతిపాదిత భూములు ప్రైవేటువి కావడం వల్ల తమకు సమాచారం లేదన్నారు.

2న జిల్లా సమీక్షా మండలి సమావేశం

తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో డిసెంబరు 2న జిల్లా సమీక్షా మండలి సమావేశం జరగనుంది. ఈ సమీక్షా సమావేశం (డీఆర్సీ)లో వివిధ శాఖల పనితీరుతో పాటు సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనులను సమీక్షించనున్నారు. దీనికోసం జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఒకటో తేదీనే తిరుపతి రానున్నారు. ఆరు నెలలకోసారి ఈ సమావేశాలు జరగాల్సి ఉండగా.. 2022 ఏప్రిల్ 4న జిల్లా ఏర్పాటయ్యాక గత ప్రభుత్వంలో రెండు పర్యాయాలే జరిగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకసారే జరిగింది.

గంగమ్మగుడికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మంగళం వెంకటేశ్వర కాలనీలో గంగమ్మగుడి నిర్మాణానికి ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం భూమిపూజ చేశారు. గుడి నిర్మాణానికి తనవంతు సాయం అందిస్తానన్నారు. ఉమ్మడి మంగళం పంచాయతీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తెలుగుగంగ నీరు అందించాలని, చిందేపల్లెలో గతంలో ఇచ్చిన ఇంటి పట్టాలను రద్దుచేసి కొత్తగా ఇవ్వాలని పలువురు మహిళలు కోరారు. అంతకుముందు ఆయనకు స్థానిక నేతలు స్వాగతం పలికారు.

సామాజిక సేవ అలవరచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేష్ కుమార్

పాకాల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవ అలవరచుకోవాలని ఎంఈవో బాబ్జీ కోరారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రత్యేక శిబిరం ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఇరంగారిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాలలో వారం రోజులు ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. మానవీయ విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో డాక్టర్ మాశిలామణి, హెచ్‌ఎం మునిరాజరెడ్డి, అధ్యాపకులు ఆదిశేఖర్ రెడ్డి, రేఖ పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం



విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దళవాయి మణియాదవ్

చంద్రగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరిగిలవారి పల్లెకు చెందిన జూపార్క్ మాజీ డైరెక్టర్ దళవాయి మణియాదవ్ తన తండ్రి మునిరత్నం సంవత్సరీకం సందర్భంగా పనపాకం పంచాయతీ పనపాకంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం అన్నదానం చేశారు. హెచ్‌ఎం సురేష్‌బాబు, ఉపాధ్యాయులు అనసూయ, రిటైర్డు ఉపాధ్యాయుడు రామచంద్రయ్య, పానేటి చెంగల్రాయులు, రెడ్డెప్పరెడ్డి, సురేష్‌యాదవ్, శేషాద్రి పాల్గొన్నారు.

రహదారి పక్కన వ్యర్థాల తొలగింపు



సీపీఆర్ విల్లాస్‌ను ఆనుకుని రహదారి పక్కనే పడేసిన వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

తిరుపతిరూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): చిగురువాడ పంచాయతీ పరిధిలో సీపీఆర్ విల్లాస్ ప్రహరీని ఆనుకుని రహదారి పక్కనే పడేసిన వ్యర్థాలు, ఎండిపోయిన మొక్కల తొలగింపు ప్రక్రియను గురువారం చేపట్టారు. కొన్ని రోజులుగా రహదారి పక్కన వీటిని అలాగే వదిలేసి ఉండడంతో జిల్లా పంచాయతీ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ఎం.లక్ష్మీదేవి సిబ్బందితో కలసి పరిశీలించారు. జేసీబీ సాయంతో ట్రాక్టర్‌లో నింపుకుని తరలించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన



నారావారిపల్లె క్లస్టర్‌లో పంటను పరిశీలిస్తున్న డైరెక్టర్ నీరజ

చంద్రగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారావారి పల్లెలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రైతు సాధికారిత సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ గురువారం సందర్శించారు. ఆర్‌వైఎస్‌ఎస్ అధికారులతో కలిసి నారావారిపల్లె క్లస్టర్‌లో సాగు చేస్తున్న ఏటీఎం, ఏ-గ్రేడ్, పీఎండీఎస్, హెల్త్ అండ్ న్యూట్రీషన్ నమూనా పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేస్తున్న పంటల పెట్టుబడి వ్యయం, దిగుబడి, ఆదాయం వివరాలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీపీఎం షణ్ముగం, అదనపు డీపీఎం ప్రతాప్‌రెడ్డి, జిల్లా యాంకర్ రవిచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి సుప్రభాత సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక గురువారం వేకువ జామున సుప్రభాత సేవలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.



ఆలయం ఎదుట జస్టిస్ నగేష్ భీమపాక

సీఐ పేరుతో హల్‌చల్

భాకరాపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య విభేదాలను ఆసరాగా చేసుకుని ఓ వ్యక్తి సీఐ పేరుతో హల్‌చల్ చేసిన ఘటన చిన్నగొట్టిగల్లు మండలంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని జంగావాళ్లపల్లి పంచాయతీ అప్పెపల్లెకు చెందిన రెడ్డిఈశ్వర్, భానుశ్రీల దంపతుల మధ్య విభేదాలు తలెత్తాయి. కేవీపల్లి మండలం చిన్నకమ్మపల్లికి చెందిన శివకుమార్ తాను కడప జిల్లాలో స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పనిచేస్తున్నానని, భానుశ్రీని వేధిస్తే చర్యలు తప్పవని రెడ్డిఈశ్వర్‌ను బెదిరించాడు. దీంతో రెడ్డిఈశ్వర్ భాకరాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. భాకరాపేట ఎస్‌ఐ రాఘవేంద్ర విచారించి శివకుమార్ సీఐ కాదని నిర్ధారించుకున్నారు. అతని కోసం గాలిస్తున్నామని, పోలీసు పేరు వాడుకున్నందుకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు మరో ఏడాది పొడిగింపు

తిరుపతిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పరిధిలోని కాంట్రాక్ట్ టీచింగ్ ఫ్యాకల్టీ సేవలను మరో ఏడాది పాటు కొనసాగింపునకు అనుమతిస్తూ పశుసంవర్థకశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. 16 విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల అగ్రినెస్ట్ పోస్టుల్లో పనిచేస్తున్న 33 మంది అధ్యాపకులకు నెలకు రూ.57,700 వేతనంతో మరో ఏడాదికాలంపాటు తాత్కాలిక ప్రాతిపదికన కొనసాగింపునకు అనుమతిచ్చారు. కాగా ఈ ఏడాది కాలంలో ఖాళీ పోస్టులలో రెగ్యులర్ పద్ధతిలో అధ్యాపకులను భర్తీచేసే వరకు వీరిని కొనసాగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 16నుంచి ఈ ఉత్తర్వులను అమలు చేయాలన్నారు.

పాడైన చిక్కీలు వెనక్కు

ఎర్రావారిపాళెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముురుగుడు వాసన వస్తున్న 4వేల చిక్కీలను వెనక్కు పంపించారు. చిక్కీలు వాసన వస్తుండటంతో మోడల్ స్కూల్ పిల్లలు బుధవారం ప్రిన్సిపాల్ సరళ దృష్టికి తెచ్చారు. అలాగే మరో రెండు ఉన్నత పాఠశాలలకు సరఫరా చేసినవీ ఇలాగే ఉన్నట్లు ఫిర్యాదు వచ్చాయి. ప్రిన్సిపాళ్లు వాటిని వెనక్కు పంపారు. ఈ విషయమై ఎంఈవో 2 సతీష్‌బాబును వివరణ కోరగా ఈ విషయం జిల్లా విద్యాశాఖ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతోందని పిల్లల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

భాకరాపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ రెండవ విడత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారిపల్లె పంచాయతీ బద్దలవారిపల్లెలో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొననున్నారు. లబ్ధిదారులతో సమావేశమై ముఖ్యమంత్రి సందేశాన్ని వివరించనున్నారు. చిన్నగొట్టిగల్లు దిగువవీధికి చెందిన దండు సుబ్రహ్మణ్యం కుమారుడి వివాహం జరిగిన నేపథ్యంలో వధూవరులను ఆశీర్వదించనున్నారు. చిన్నగొట్టిగల్లు గ్రామంలో విరూపాక్షమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి తెలిపారు. 11 గంటలకు చిన్నగొట్టిగల్లు తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ సమస్యలపై సదస్సు నిర్వహించనున్నారు. రైతులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

చెత్త సేకరణ సరే.. సద్వినియోగమేదీ..!

సంపద తయారీ కేంద్రాలకు చేరని చెత్త - స్వర్ణముఖి నదిలోకి చేరుతున్న వ్యర్థాలు





చెత్త, వ్యర్థాలను స్వర్ణముఖినదిలో డంప్ చేస్తున్న దృశ్యం - రహదారి పక్కన వదిలేసిన నిర్మాణ, ఇతర వ్యర్థాలు

తిరుపతిరూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని పలు పంచాయతీల్లో సిబ్బంది ఇళ్ల నుంచి సేకరించిన చెత్త, వ్యర్థాలను ట్రాక్టర్ల ద్వారా సమీపంలోని స్వర్ణముఖి నది వంకలో, రహదారి అంచుల్లో పడేస్తున్నారు. తిరుచానూరుతోపాటు సమీపంలోని పలు గ్రామాల్లో ఇంటింటా సేకరించిన చెత్తను తనపల్లె మార్గంలోని నదీ పరివాహక ప్రాంతంలో పడేసి వెళ్తున్నారు. కొన్ని గ్రామాల్లో సంపద కేంద్రాల్లోని ఖాళీ స్థలాల్లో వదిలేస్తుండడంతో గుట్టలుగా పేరుకు పోతున్నాయి. 2014-19లో టీడీపీ ప్రభుత్వం చెత్తనుంచి సంపద సృష్టించాలన్న ఉద్దేశంతో మండల పరిధిలోని అత్యధిక గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొన్ని గ్రామాల్లో ఖాళీస్థలాలు లేకపోవడంతో నదికి సమీపంలో వీటిని నిర్మించారు. 2021లో వచ్చిన భారీ వరదలకు కొన్ని కేంద్రాలు కొట్టుకుపోయాయి. తనపల్లె స్వర్ణముఖి వద్ద వరదలకు కొట్టుకుపోయిన కేంద్రంలో గుట్టుచప్పుడు కాకుండా పంచాయతీ వాహనాల ద్వారా చెత్త, వ్యర్థాలను తరలించి వదిలేస్తున్నారు. వరదలు వస్తే ఈ వ్యర్థాలు నదిలోకి కొట్టుకుపోయి నీటికాలుష్యంతో పాటు ప్రవాహానికి అడ్డుపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● తూతూమంత్రంగా వ్యర్థాల తొలగింపు: తనపల్లెకు వెళ్లే మార్గంలోని స్వర్ణముఖి నది కాలువను ఆనుకుని ఉన్న ఒడ్డుపై, రహదారి పక్కనే చెత్త, ప్లాస్టిక్, భవన నిర్మాణ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి ఉండటంపై బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు తూతూమంత్రంగా తొలగించారు. చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు కొంతవరకు మాత్రమే తొలగించారు. మిగిలిన వ్యర్థాలను అలాగే వదిలేశారు. నిర్మాణ వ్యర్థాలు, మట్టిదిబ్బలను జేసీబీ సాయంతో కొంతదూరం అక్కడికక్కడే సర్దుబాటు చేసి వదిలేశారు. ఓ పక్క వ్యర్థాల తొలగింపు పనులు చేపడుతుండగానే.. మరోపక్క తిరుచానూరు పంచాయతీకి చెందిన చెత్త, వ్యర్థాలను ట్రాక్టర్ ద్వారా తరలించి నదీ పరివాహక ప్రాంతంలో పడేసి వెళ్తుండటం కనిపించింది. కాగా పంచాయతీ సిబ్బంది సేకరించిన చెత్తను రామాపురంలోని డంపింగ్ యార్డుకు తరలించడం వ్యయ ప్రయాసలతో కూడుకోవడంతో సమీపంలోని వంకలో వదిలేస్తున్నారని తెలిసింది. అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించండి

చంద్రగిరి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో డిసెంబరు 2, 3 తేదీలలో గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. గురువారం రాత్రి మూలస్థాన ఎల్లమ్మ ఆలయ ఆవరణలో జాతర నిర్వహణ గురించి గ్రామ పినపెద్దలు, గ్రామస్తులతో, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేకంగా ఉండాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పినపెద్దలు పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి, విరుపాక్షి శంకర్‌రెడ్డి, మొక్కల రాజారెడ్డి, నామాల శ్రీనివాసులు, మూలస్థాన ఎల్లమ్మ ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గౌస్‌బాషా, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సీఐ సురేష్‌కుమార్, ఈవోఆర్డీ వెంకటరత్నం, పంచాయతీ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దుబాసి రామ్మూర్తి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్‌రెడ్డి

చిత్తూరులో 'దేవగుడి' సందడి



విజయం కళాశాలలో 'దేవగుడి' మూవీ బృందం

చిత్తూరు రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో గురువారం 'దేవగుడి' సినిమా బృందం సందడి చేసింది. ముందుగా నగర శివారు ప్రాంతంలోని విజయం విద్యాసంస్థలో టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా సినిమా దర్శక నిర్మాత బెల్లం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కంటెంట్‌ను నమ్మి తీసిన చిత్రం దేవగుడి అన్నారు. రాయలసీమ నేపథ్యంలో ప్రజలను ఆకట్టుకునేలా తీసిన దేవగుడి చిత్రానికి విజయాన్ని చేకూర్చాలని కోరారు. డిసెంబర్ 19న ప్రేక్షకుల మధ్యకు రాబోతున్న ఈ సినిమాలో హైదరాబాదుకు చెందిన అభినవ్ శౌర్య హీరోగా, భీమవరానికి చెందిన అనుశ్రీ హీరోయిన్‌గా నటించారన్నారు.నగరంలోని ఎస్వీ కళాశాలలో కూడా సినీ బృందం విద్యార్థులతో ముచ్చటించింది. విజయం కళాశాల చైర్మన్ తేజోమూర్తి, ఏవో రాజగోపాల నాయుడు, ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోండి

భాకరాపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చిన్నగొట్టిగల్లు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ రైతులకు సూచించారు. చిన్నగొట్టిగల్లు మండలం కందులవారిపల్లె, అయ్యప్పశెట్టివారిపల్లె, చిగరాల చెరువు దళితవాడల్లో గురువారం 'రైతన్నా.. మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి సందేశాన్ని వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు చేసుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని అధిక దిగుబడినిచ్చే పంటలు సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమార్ నాయక్, సర్పంచ్ మనోహర్, టీడీపీ నాయకులు ఎర్రయ్య నాయుడు, చోటా సాహెబ్, మల్లికార్జున పాల్గొన్నారు.



సీఎం సందేశ కరపత్రాలను పంపిణీ చేస్తున్న శివకుమార్

'గజ' భయం

● చీకటి పడితే ఆ రోడ్లలో ప్రయాణాలు బంద్

ఎర్రావారిపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చీకటి పడితే ఆ మార్గాల్లో వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ప్రయాణాలు బంద్ చేసుకుంటున్నారు. ఆ రోడ్లు ఏవంటే.. చిన్నగొట్టిగల్లు -ఎర్రావారిపాలెం మండల సరిహద్దులోని భాకరాపేట- దేవరకొండ, దేవరకొండ-చింతగుంట, తుమ్మసేనుపల్లె మార్గాలు. అంత భయం ఎందుకంటే.. రాత్రి 7 గంటల తర్వాత ఏనుగుల గుంపు ఆ రోడ్లపైకి వస్తుండటమే. చిట్టేచెర్ల గ్రామం కొత్తపల్లె వద్ద గత వేసవిలో సిద్ధయ్య అనే రైతు సాయంత్రం ఇంటికొస్తుండగా ఏనుగులు దాడి చేసి చంపాయి. గత వారం రోజులుగా చిట్టేచెర్ల, దేవరకొండ, చింతగుంట పంచాయతీలో గజరాజుల సంచారంతో ప్రజలు రాత్రి పూట రోడ్లపై రాకపోకలు సాగించేందుకు భయపడుతున్నారు. పలమనేరు ప్రాంతం నుంచి వచ్చిన ఈ 16 ఏనుగుల గుంపు మనుషుల పైకి దూసుకొస్తున్నాయని భయపడుతున్నారు. అదే తలకోన ప్రాంతంలో శాశ్వత నివాసం వున్న 36 ఏనుగులు తలకోన, చామల, తిరుమల, కళ్యాణి డ్యామ్, అన్నమయ్య జిల్లా కోడూరు, బాలపల్లె ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి. ఇవి అంత క్రూరంగా ప్రవర్తించవని రైతులు చెబుతున్నారు. పంట పొలాల్లోకి వచ్చినప్పుడు శబ్దాలు చేసి తరిమితే ఈ ఏనుగులు బెదిరి పోతున్నాయట. అదే పలమనేరు ప్రాంతం నుంచి వచ్చినవైతే జనాలపైకి తిరగబడుతున్నాయి.



● మేకను చంపేయడంతో భయాందోళన

పూతలపట్టు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):పూతలపట్టు మండలం కమ్మగుట్టపల్లె అడవిలో వున్న చిరుత గోపాలపురం అటవీప్రాంతంలోకి వెళ్లి ఓ మేకను తినేయడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు. కమ్మగుట్టపల్లి సమీపానగల కమ్మగుట్ట అటవీప్రాంతంలో చేపలు పట్టేందుకు వెళ్లిన కొంత మంది చిరుత సంచరిస్తున్నట్లు గుర్తించారు.ఈ విషయం చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలకు తెలియడంతో భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న ఐరాల అటవీశాఖ అధికారులు గ్రామాల్లోకి వచ్చి ప్రజలకు అవగాహన కల్పించి వెళ్లారు. అనంతరం ఈ చిరుత కమ్మగుట్టపల్లి సమీపాన గల గోపాలకృష్ణాపురం వద్ద వున్న అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు స్థానికులు గుర్తించారు. అక్కడ మూర్తిగానివూరు గ్రామానికి చెందిన వజ్రం అనే రైతు తన పశువులతో పాటు మేకలను కూడా మేపేందుకు అడవిలో వదిలి ఇంటికి చేరుకున్నారు. సాయంత్రం మేకలను, పశువులను ఇంటికి తరలించేందుకు అడవిలోకి వెళ్లగా మేక కళేబరం కనిపించడంతో భయాందోళనకు గురయ్యాడు. పశువులు, మేకలతో పరుగుపరుగున ఇల్లు చేరుకున్నాడు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామస్తులకు తెలియడంతో ప్రజలు పొద్దుపోయాక ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు కూడా భయపడుతున్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత



శ్రీకాళహస్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోగొట్టుకున్న పర్సును భక్తునికి తిరిగి అప్పగించారు. ముంబయికి చెందిన యోగేష్ దిలీప్ అనే భక్తుడు గురువారం దర్శనానికి వచ్చి పర్సును పోగొట్టుకున్నాడు. గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది పర్సును ఎస్పీఎఫ్ సిబ్బందికి అందజేశారు. వారు పర్సును తనిఖీ చేయగా రూ.60 వేలు నగదు, ఆధార్‌కార్డు లభించాయి. వారు మైక్‌లో చేసిన ప్రకటన విని చేరుకున్న భక్తుడికి వివరాలు సరిచూసుకుని పర్సును అందజేశారు.

భగవద్గీత పారాయణ పోటీలు



విజేతలతో నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చిత్తూరు తపోవనం ఉన్నత పాఠశాలలో గురువారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల, ఇంటర్ విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పారాయణ పోటీలను టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ నిర్వహించింది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీతలోని గుణత్రయ విభాగ యోగం శ్లోకాల పోటీల్లో 64 మంది పాల్గొనగా, చిత్తూరు విజయం సీబీఎస్ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని పి.సుకీర్తి ప్రథమ బహుమతి గెలుచుకుంది. పది నుంచి ఇంటర్ స్థాయి వారికి నిర్వహించిన దైవాసుర సంపద్విభాగ యోగం శ్లోకాల పోటీల్లో 26 మంది పాల్గొనగా, చిత్తూరు విజ్ఞాన సుధ జూనియర్ కళాశాల విద్యార్థి వి.నారాయణ ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నాడు. 14 సంవత్సరాల పైబడి 45 సంవత్సరాల లోపున్న వారికి నిత్యజీవితంలో భగవద్గీత అనే అంశంపై నిర్వహించిన భావ విశ్లేషణ పోటీల్లో 24మంది పాల్గొనగా, తపోవనం ఇస్కాన్ ఉపాధ్యాయురాలు రేవతి ప్రథమ బహుమతిని గెలుపొందారు. న్యాయ నిర్ణేతలుగా రంగస్వామి, వి.హేమలత, లలిత, కుప్పయ్య, మునస్వామి, రంగారావు, పి.హేమలత, సిద్ధిరామిరెడ్డి తదితరులు వ్యవహరించారు. విజేతలకు నగదు బహుమతులు, జ్ఞాపికలు పంపిణీ చేశారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలకు గీతా జయంతి రోజున రాష్ట్రస్థాయి పోటీలను తిరుపతిలో నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ భద్రావతి తెలిపారు.

రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం

రామచంద్రాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు హామీ ఇచ్చిన మేరకు ఇప్పటికే రైతు ఖాతాల్లో రెండు విడతలుగా రూ.14వేలు జమచేసి ఆదుకున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. మండలంలోని కేకేవీపురం గ్రామంలో గురువారం టీడీపీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి అధ్యక్షతన రైతన్నా మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించి ల్యాండ్ టైటిల్ యాక్టు తెస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేసిందన్నారు. పంచాయతీలోని స్త్రీశక్తి భవనాన్ని వైసీపీ నాయకులు ఇష్టానుసారం వాడుకుని పొదుపు మహిళలు చెట్టుకింద సమావేశాలు నడుపుకునేలా చేశారని సంఘమిత్ర సరళ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయన అప్పటికప్పుడు అధికారులతో సంప్రదించి స్త్రీశక్తి భవనాన్ని పొదుపు మహిళలకు కేటాయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఉమాపతి నాయుడు, నరసింహారెడ్డి, హరిప్రసాద్, సురేంద్రనాయుడు, మునిరామిరెడ్డి, తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీడీవో పులి రామ్‌సింగ్, వ్యవసాయశాఖాధికారిణి మమత పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

జాతీయ కరాటే పోటీలకు తనూహ్య



వరదయ్యపాళెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాండూరు జడ్పీ హైస్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థిని తనూహ్య జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. రాజమండ్రిలో జరిగిన అండర్-17,32 కేజీల విభాగంలో తనూహ్య ఉత్తమ ప్రతిభకనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని కోచ్ కన్నయ్య తెలిపారు. ఈమెను ప్రధానోపాధ్యాయులు మునిసుబ్రహ్మణ్యం, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

క్రీడా సముదాయం తీరు మారేనా?

- ఎటుచూసినా పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్త
- స్పష్టమవుతున్న పర్యవేక్షణ లోపం





జంక్షన్ పాయింట్ల వద్ద నిర్లక్ష్యంగా వదిలేసిన విద్యుత్ తీగలు





క్రీడా సముదాయం ప్రాంగణంలో వదిలేసిన ఎండిపోయిన చెట్ల వ్యర్థాలు - తుప్పుపట్టిన ఫర్నీచర్

తిరుపతి(క్రీడలు), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో పరిస్థితి మెరుగుపడటం లేదు. ఎటుచూసినా చెత్తచెదారం, వ్యర్థ సామగ్రి గుట్టలతో కళా విహీనంగా తయారైంది. ఎస్వీయూలోని ఈ క్రీడా సముదాయంలో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. ఎటుచూసినా ఎండిపోయిన కొమ్మలు, దిబ్బలు దిబ్బలుగా విరిగిన షోలైట్లు, విద్యుత్ స్తంభాలు, పాడైన క్రీడా సామగ్రి, పాచిపట్టి, ఉప్పుపేరుకుపోయిన మరుగుదొడ్లు, మరమ్మతులకు గురైన నీటి కొళాయిలు, ధ్వంసమైన టాయిలెట్లు, పైపులు, తలుపులు, భవనం గోడలపై ఏపుగా పెరుగుతున్న పిచ్చిమొక్కలు, మట్టికుప్పలు దర్శనమిస్తున్నాయి. చెట్లు పూర్తిగా ఎండిపోతున్నాయి. గోడలకు రంగులు వెలిసిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాకింగ్ ట్రాక్ కొట్టుకుపోయింది. ప్రధాన భవనం ముందుభాగంలో చేపట్టిన అభివృద్ధి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. భవనాల అంతర్భాగంలో బూజు దట్టంగా అల్లుకుంది. గోడలపై పిచ్చిరాతలు దర్శనమిస్తున్నాయి. బల్బులు వెలగడం లేదు. విద్యుత్ స్తంభాల జంక్షన్ బాక్సుల్లో తీగలు అనుసంధానం చేయకపోవడంతో గాలిలో ఊగుతున్నాయి. ప్రాంగణంలో పిచ్చిమొక్కలు పెరిగి పాములు, తేళ్లకు అవాసాలుగా మారిపోయాయి. జిల్లా కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఇలా ఉండటంపై క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.







అభివృద్ధి పనుల కోసం తోలి అలాగే వదిలేసిన మట్టి - భవనం పక్కనే పేర్చిన పాడైపోయిన సింక్‌లు - తొలగించకుండా వదిలేసిన చెత్తాచెదారం

కాలువల్లో చెత్త ఎప్పటికప్పుడు తొలగించండి



అధికారులతో కలిసి డ్రైనేజీలను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : నగరంలో మురుగునీరు రోడ్లపైకి రాకుండా కాలువల్లో చెత్త, మట్టి తొలగించాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్, కమిషనర్ ఎస్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం 19వ వార్డులోని దుర్గానగర్, శేషాద్రి నగర్, పోలీస్ క్వార్టర్స్, జడ్జిల క్వార్టర్స్‌లో కార్పొరేటర్ ఆరణి సంధ్య, అధికారులతో కలసి కమిషనర్ తనిఖీ చేశారు. చెత్త బండి వస్తోందా? కాలువలు శుభ్రం చేస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కొన్నిచోట్ల మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని మహిళలు ఆమె దృష్టికి తెచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా ఉన్న గడ్డి, ముళ్ల కంపలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. చెత్తను కాలువల్లో వేయకుండా సహకరించాలని కోరారు. కమిషనర్ వెంట ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈ తులసికుమార్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఉన్నారు.

● తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య మార్గదర్శిగా ఉన్న ఓ కుటుంబానికి వారి కోరిక మేరకు తోపుడు బండిని అందజేశారు. 6 కుటుంబాలను మార్గదర్శిగా ఆమె దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. వారి అవసరాల మేరకు మ్యాపింగ్ చేసిన విధంగా కమిషనర్ తన సొంత డబ్బులతో అందజేస్తున్నారు.

శెట్టిపల్లె లే అవుట్ పనులు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లె లే అవుట్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి, లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో శెట్టిపల్లె లేఅవుట్ డెవలప్‌మెంట్ పనులపై ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, ఇతర అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. శెట్టిపల్లెలో ఆధునిక సదుపాయాలతో కూడిన లేఅవుట్ నిర్మాణం జరుగుతోందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, పార్కులు వంటి సదుపాయాలు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తుడా భూసేకరణ అధికారి సుజన తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి) : పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, దీనికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పీ4 అమలు చేస్తోందన్నారు. స్థానిక కచ్చపి ఆడిటోరియంలో గురువారం నియోజకవర్గ స్థాయి యాక్షన్ ప్లాన్ యూనిట్ సమావేశం కమిషనర్ ఎస్.మౌర్య అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గంలో పేదరిక నిర్మూలనలో భాగంగా ఇప్పటివరకు అనేక కుటుంబాలను దత్తత తీసుకున్నట్లు చెప్పారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ తిరుపతిలో 7,455 బంగారు కుటుంబాలు ఉంటే 6,411 మందిని మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. మిగిలిన 1,044 మందిని త్వరలోనే మ్యాపింగ్ చేయించి, ఆదుకుంటామని తెలిపారు. కొంతమంది మార్గదర్శులు వార్డులను కూడా దత్తత తీసుకోవడానికి ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఆర్వోలు సేతుమాధవ్, రవి, మార్గదర్శులు, బంగారు కుటుంబాల సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో పీజీ పేమెంట్, స్పాన్సర్ సీట్ల భర్తీకి చర్యలు

● డిసెంబరు 1న అడ్మిషన్లు : రిజిస్ట్రార్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో పీజీ (ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ) పేమెంట్, స్పాన్సర్ సీట్ల భర్తీకి అధికారులు చర్యలు చేపట్టారు. డిసెంబరు ఒకటో తేదీన ఇందుకు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తామని ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు తెలిపారు. పీజీసెట్-2025లో అర్హత సాధించి, ఏ కోర్సులోనూ చేరని వారు ఇందుకు అర్హులు. ఒకటో తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుతో అడ్మిషన్స్ కార్యాలయంలో సంప్రదించాలని రిజిస్ట్రార్ కోరారు. ఈ కేటగిరిలో సీటు పొందిన వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించదని అన్నారు. అడ్మిషన్లు ర్యాంకుల ఆధారంగా చేపడతామన్నారు. సమగ్ర సమాచారం కోసం 0877-2248589 నెంబరులో సంప్రదించాలని రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో సూచించారు.

తిరుపతి-షిరిడీకి ప్రతిరోజూ రైలు

● 9నుంచి ప్రారంభం

తిరుపతి(సెంట్రల్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి షిరిడీకి వారాంతరంగా నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ స్థానంలో డిసెంబరు 9 వ తేదీ నుంచి అన్ని రోజులు నడుపుతూ దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆదివారం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు, మంగళవారం సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వారం మొత్తం రద్దీ ఉండటాన్ని గుర్తించి రోజూ నడిపేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు జోనల్ అధికారులు గురువారం స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. 9వ తేదీన తిరుపతి రైల్వేస్టేషన్‌లోని 6వ నెంబరు ప్లాట్ ఫారం నుంచి ఈ ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతుంది. రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ, వినాయక పూజల కలశ పూజ వైదిక కత్రువులు నిర్వహించాక వైభవంగా అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కేవీబీపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కాట్రపల్లి గిరిజన కాలనీకి చెందిన సుధాకర్ (31) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలిలా.. సుధాకర్, అతని భార్య సుగుణ కూలి పనులపై ఆధారపడి బతుకుతున్నారు. వీరికి నలుగురు సంతానం. ఆర్థిక పరిస్థితి సరిగా లేక సుదాకర్ అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం లేక బుధవారం రాత్రి ఇంట్లో ఉన్న విష గుళికలు తిని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. భార్య సుగుణ వెంటనే 108 వాహనం ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుదాకర్ మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించండి



తిరుపతి రైల్వేస్టేషన్‌లో నూతన భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వేస్టేషన్‌లో దక్షిణం వైపు జరుగుతున్న భవనం సీలింగ్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం సెక్రటరీ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. తిరుపతి పర్యటనలో భాగంగా గురువారం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేసి, ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రణాళిక మేరకు నిర్మాణ పనులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ సీఈ జి.వామనమూర్తి, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, అధికారులు దరూరు ప్రభాకర్, మాధవరావు, రమణరావు, సిద్ధారెడ్డి పాల్గొన్నారు.

మిద్దెపై నుంచి పడి ఆటోడ్రైవర్ మృతి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మిద్దెపై నుంచి పడి ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన గురువారం తిరుపతిలో చోటు చేసుకుంది. వెస్ట్ సీఐ మురళీ మోహన్ వివరాల మేరకు.. మంచినీళ్ల గుంటకు చెందిన మాచిర్(37) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఇంటి మిద్దెపైకి ఎక్కుతూ కాలుజారి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తీసుకెళుతుండగా మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మాచిర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

మంగళగిరి జనవాణిలో..



అర్జీలు స్వీకరిస్తున్న రాజారెడ్డి

తిరుపతి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జనవాణి కార్యక్రమంలో ఆ పార్టీ తిరుపతి నగరాధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు. పార్టీ అధిష్ఠానం ఆహ్వానం మేరకు హాజరైన ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ముంపు బాధితులకు టేబుల్ ఫ్యాన్ల వితరణ



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న ఇసుజు ప్రతినిధులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం రాయలచెరువు ఘటనలో ముంపునకు గురైన కళత్తూరు, రాజులకండ్రిగ, పాతపాళెం బాధితులకు ఇసుజు మోటార్స్ కంపెనీ వంద టేబుల్ ఫ్యాన్లను వితరణ చేసింది. వీటిని కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. ఆయన వారిని అభినందించారు.

పద్మనాభానికి డాక్టరేట్



పద్మనాభంను సన్మానిస్తున్న రాయలసీమ రంగస్థలి కళాకారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మనాభ నేషనల్ అకాడమీ కార్యదర్శి, టీఎన్‌టీయూసీ తిరుమల, తిరుపతి అధ్యక్షుడు కస్పా పద్మనాభానికి ఊటీలోని యాక్టింగ్ అండ్ కల్చరల్ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. సామాజిక, సాంస్కృతిక రంగాల్లో చేసిన కృషికి గుర్తింపుగా డాక్టరేట్ అందించారు. రాయలసీమ రంగస్థలి కళాకారులు ఆయన్ను గురువారం సత్కరించారు.

జేసీఐ తిరుపతి అధ్యక్షురాలిగా మునిలక్ష్మి



గతంలో ఉన్న ప్రతినిధిని సన్మానిస్తున్న మునిలక్ష్మి

తిరుపతి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జేసీఐ(జూనియర్ చాంబర్ ఆఫ్ ఇండియా) తిరుపతి అధ్యక్షురాలిగా నెల్లూరు మునిలక్ష్మి నియమితులయ్యారు. బుధవారం రాత్రి స్థానిక హోటల్లో జరిగిన కార్యక్రమంలో పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఉమ వెన్నం ఆమెతో ప్రమాణం చేయించారు. గౌరవ అతిథులుగా జేసీఐ ఇండియా డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్‌రెడ్డి, ప్రమోద్‌కుమార్, మనోహర్, ప్రదీప్, హరిప్రసాద్, నీరజ, త్రిశల, బి.అర్చన పాల్గొని ఆమెను అభినందించారు. కలంకారి శాలువలు, చిత్రపటాలను బహూకరించారు.

ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సత్కరిస్తున్న సభ్యులు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు27(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఓ హోటల్‌లో గురువారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దయ్య (నంద్యాల), ప్రధాన కార్యదర్శిగా టి.జయరాం(తిరుపతి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మస్తాన్(అనంతపురం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుబ్బన్న (కర్నూలు), కోశాధికారిగా నాగరాజు (శ్రీకాళహస్తి), ఉపాధ్యక్షులుగా శీనయ్య(వెంకటగిరి), సహాయ కార్యదర్శులుగా రమణయ్య (నెల్లూరు), ఐ.వరయ్య(కడప), కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

రామేశ్వరం-తిరుపతి ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం-తిరుపతి ప్రత్యేక రైలు (నెం.06080) రామేశ్వరంలో డిసెంబరు 2,9 తేదీల్లో సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరి మరునటిరోజు ఉదయం 10.10 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.06079 తిరుపతి-రామేశ్వరం ప్రత్యేక రైలు డిసెంబరు 3,10 తేదీల్లో తిరుపతిలో ఉదయం 11.55 గంటలకు బయల్దేరి మరునటిరోజు వేకువజామున 4.45 గంటలకు రామేశ్వరం చేరుకుంటుంది. ఈ రైలు కుంభకోణం, శీర్గాళి, విల్లుపురం, తిరువణ్ణామలై, ఆరణి రోడ్డు, వేలూరు, కాట్పాడి, పాకాల మీదుగా నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.





పల్లకిలో పద్మావతి

● వేడుకగా మహంతు ఉత్సవం

తిరుచానూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు గురువారం సాయంత్రం పల్లకిలో ఊరేగారు. కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు అమ్మవారు తన పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడం ఆనవాయితీ. ఈ మహంతు ఉత్సవంలో భాగంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మసరోవరం వద్దనున్న హథీరాంజీమఠంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణానికి వేంచేపు చేశారు. హథీరాం మఠం తరఫున దేవదాయశాఖ అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అభిషేకం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవి పల్లకిలో కొలువుదీరి తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. హథీరాంజీ మఠం పర్యవేక్షణాధికారి బాపిరెడ్డి, ఆమ్మవారి ఆలయ అధికారులు చలపతి, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,670

తలనీలాలు సమర్పించినవారు: 26,062



సాహిత్యంతో మహిళల్లో నాయకత్వ శక్తి

● ఉస్మానియా వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ కాశీం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాహిత్యంతో ఎందరో రచయితలు మహిళల్లో నాయకత్వ పటిమను రగిలించారని హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అభిప్రాయపడ్డారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో గురువారం నిర్వహించిన పోపూరి వేంకట సుబ్బారావు స్మారక ధర్మనిధి సదస్సులో ఆయన 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ- కవిత్వం, నాటకంపై ప్రసంగించారు. మహిళల జీవితంలోని అనేక సమస్యలను గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' నాటకంలోనూ, కాళ్ళకూరి నారాయణరావు 'వరవిక్రయం' నాటకంలోనూ, శివసాగర్ 'చెల్లీ చెంద్రమ్మ' కవిత, గద్దర్ 'సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మో లచ్చుమమ్మో' పాటలోనూ కనిపిస్తుందన్నారు. ఈ రచనల్లో రచయితలు కేవలం సమస్యలను వివరించడంతో సరిపెట్టుకోకుండా పరిష్కారాలనూ సూచించారన్నారు. తద్వారా మహిళల్లో నాయకత్వ పటిమను, పోరాట స్ఫూర్తిని రగిలించే ప్రయత్నం చేశారని అభిప్రాయపడ్డారు. 'ఆధునిక సాహిత్యంలో స్త్రీ నాయకత్వ పటిమ - కథ, నవల' అంశంపై కడప యోగి వేమన వర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఎంఎం వినోదిని ప్రసంగించారు. మహిళలను మంచి మార్గంలో నడిపించేదే గొప్ప సాహిత్యమని పేర్కొన్నారు. మహిళల్లో నాయకత్వ పటిమ అంటే నలుగురిని వెంట నిలబెట్టుకోవడం మాత్రమే కాదనీ, విపత్కర పరిస్థితుల్లో మనోనిబ్బరంతో నిలదొక్కుకోవడమని చెప్పారు. ఓల్గా, యద్దనపూడి సులోచనా రాణి, వాసిరెడ్డి సీతాదేవి వంటి వారి రచనలు చదవడం వల్ల మహిళలు చైతన్యం పొందవచ్చని పద్మావతి వర్సిటీ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ వాణి సూచించారు. నలుగురిని నడిపించడమే కాదు.. నాయకురాలిగా అందరినీ కలుపుగోలుగా ఒకే పథం వైపు నడిపించడం నాయకురాలి మౌలిక లక్షణమని తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ కొలకలూరి మధుజ్యోతి తెలిపారు. ఈ ధర్మనిధి సదస్సుకు ఆర్థిక సహకారాన్ని అందించిన రచయిత్రి ఓల్గాకు సదస్సు సంచాలకుడు డాక్టర్ యువశ్రీ ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సు సందర్భంగా చేపట్టిన వ్యాస రచన పోటీలకు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ కృష్ణవేణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రచయిత ఆర్సీ కృష్ణస్వామిరాజు, సాహిత్యవేత్తలు, డాక్టర్ లక్ష్మీప్రియ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీలో విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరును రాష్ట్రప్రభుత్వం జిల్లా కేంద్రంగా ప్రకటించాలని గూడూరు ప్రజాసమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి డిమాండు చేశారు. అన్నారు. గురువారం జరిగిన గూడూరు ప్రజాసమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. గూడూరును జిల్లా చేసేందుకు అసరమైన భౌగోళిక మౌలిక వసతులు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎన్నో ఏళ్లుగా రెవెన్యూడివిజన్‌కి కేంద్రంగా ఉందన్నారు. ఇక్కడ నుంచి మైకా, నిమ్మకాయలు విదేశాలకు ఎగుమతులు చేస్తుండడంతో గూడూరుకు గుర్తింపు ఉందన్నారు. రైల్వేజంక్షన్, పరిశ్రమలు, సముద్ర తీరం.. ఇలా అన్ని వనరులున్న గూడూరును జిల్లా కేంద్రంగా చేసుకునేందుకు జరపనున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. ఎన్నో ఏళ్లుగా నెల్లూరుజిల్లాతో అనుబంధమున్న గూడూరును తిరుపతిజిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు నియోజకవర్గ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గూడూరును నెల్లూరుజిల్లాలో కలపాలని కోరారు. లేదంటే ప్రజాసమితి అధ్వర్యంలో మొదటగా పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించి.. దశలవారీగా ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గూడూరు ప్రజాసమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి

నేడు విద్యాసంస్థల బంద్: ఏఎస్ఎఫ్

గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ శుక్రవారం నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఎస్ఎఫ్) నేత షఫీహరన్, శ్యామ్‌కుమార్ గురువారం కోరారు. తిరుపతి జిల్లాలోని గూడూరును నెల్లూరులో కలుపుతామన్న హామీని సీఎం చంద్రబాబు నెరవేర్చాలన్నారు.

సుందరకాండ పారాయణానికి అంకురార్పణ

తిరుమల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం నుంచి డిసెంబరు 13వ తేదీ వరకు జరుగనున్న షోడశదిన సుందరకాండ పారాయణానికి ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో గురువారం సాయంత్రం అంకుర్పాణ జరిగింది. ఇందులో భాగంగా పుణ్యాహవచనం, రక్షాబంధనం, మత్స్యంగ్రహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు వసంతమండపంలో సుందరకాండ పారాయణం, ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరాధన, అభిషేకం, హోమం, అనుష్ఠానం నిర్వహిస్తారు. డిసెంబరు 13న పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగియనుంది. అంకురార్పణ కార్యక్రమంలో వేదవిజ్ఞానపీఠం ప్రిన్సిపాల్ ఎస్ఎస్ అవధాని, వేదపండితులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని టీడీపీ నాయకుడి మృతి



బాబు (ఫైల్‌ఫొటో)

బాలాయపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని టీడీపీ నాయకుడు మృతిచెందిన సంఘటన గురువారం గూడూరు రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. రైల్వేజీఆర్ పోలీసుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం వ్యాఖ్యం గ్రామానికి చెందిన నర్రావుల బాబు(49) గురువారం ఉదయం ఇంటి వద్ద నుంచి పనుల నిమిత్తం గూడూరుకు వెళ్లారు. గూడూరులోని రెండో ప్లాట్‌ఫాం సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా చెన్నై నుంచి విజయవాడ వైపు వెళుతున్న గుర్తుతెలియని రైలు ఢీకొంది. దీంతో బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. రైల్వే జీఆర్ పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈయన వ్యాక్యం గ్రామంలో టీడీపీ గ్రామస్థాయి నాయుకుడిగా కొనసాగుతున్నాడు. బాబు మృతి టీడీపీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయి సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు రాయి మస్తాన్‌నాయుడులు తెలిపారు. బాబు మృతిచెందడంపై పలువురు టీడీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

ఆక్వా బకాయిలు రూ.9 కోట్లు



సదరన్ డిస్కం కార్యాలయ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న డిస్కం ఈఈ కేవీ నరేంద్రరెడ్డి

కోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరు డివిజన్‌లో ఆక్వా బకాయిలు 9 కోట్లు వసూలు కావాల్సి ఉందని దీనిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామని సదరన్ డిస్కం ఈఈ కేవీ నరేంద్రరెడ్డి అన్నారు. కోట మండలం చెందోడు విద్యుత్ సబ్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. సబ్ డివిజన్‌లోని పలు ఏఈలు, సబ్ ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీర ప్రాంత మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలలో ఆక్వా బకాయిలు పేరుకుపోయి ఉన్నాయన్నారు. 2600 ఆక్వా సర్వీసులు బకాయి ఉన్నాయన్నారు. వీటిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వసూళ్లకు చర్యలు చేపడుతామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి సర్వీసుల విద్యుత్ బిల్లులపైనా ఈ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామ న్నారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిన్నయ్య, పలువురు ఏఈలు ఉన్నారు. అంతకుముందు ఆయన నూతన సబ్ స్టేషన్ కోసం స్థల పరిశీలన చేశారు.

పరిశ్రమ నిర్వాహకుల్లో ఉత్తేజానికి 'కైజాన్'



విజేతలుగా నిలిచిన వారితో పరిశ్రమల నిర్వాహకులు

తిరుపతి(వైద్యం), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల నిర్వాహకుల్లో నూతన ఉత్తేజాన్ని నింపడంతోపాటు కొత్త ఆలోచనలు పంచుకోవడానికి 'కైజాన్' వంటి పోటీలు ఉపయోగపడతాయని సీఐఐ తిరుపతి వైస్‌ఛైర్మన్ ఎస్పీ రాజేంద్రన్ అన్నారు. తిరుపతిలో గురువారం సీఐఐ రాష్ట్ర స్థాయి కైజాన్ రెండవ ఎడిషన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా నిర్వహించిన ఆపరేషన్స్ కేటగిరిలో మొదటి స్థానంలో అర్జాస్ స్టీల్స్ ప్రవేట్ లిమిటెడ్, ద్వితీయ స్థానంలో అపోలో టైర్స్, తృతీయ స్థానంలో ఐటీసీ లిమిటెడ్ నిలిచాయి. అలాగే సూపర్‌వైజర్ల స్థానంలో అపోలో టైర్స్, సుందరం ఫాస్టనర్స్ లిమిటెడ్, కెల్లాగ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 20కు పైగా జట్లు పాల్గొన్నాయని రాజేంద్రన్ తెలిపారు. వీరి ఆలోచనలు ఒకరికి ఒకరు పంచుకోవడం కోసమే ఇటువంటి పోటీలను నిర్వహించామని, వీటిని ప్రోత్సాహంగానే భావించాల్సిన అవసరం ఉందన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్యూసీపీఐ హైదారాబాద్ ఛాప్టర్ అధ్యాపకులు హనుమంతరావు, టీవీ కృష్ణారావు, డిక్సన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ఏజీఎం శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

● గూడ్స్ షెడ్, ఎగుమతుల కేంద్రం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ● పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకు సుముఖం





తడ రైల్వే స్టేషన్ - గూడ్స్‌షెడ్ నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలం

తడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. గూడ్స్‌షెడ్ నిర్మాణంతో పాటు ఎగుమతుల కేంద్రం ఏర్పాటుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. తడ... 2007కు ముందు వరకు ఓ మారుమూల కుగ్రామం. 2008లో శ్రీసిటీ, మాంబట్టు సెజ్ ఏర్పాటుతో అభివృద్ధికి అడుగులు పడ్డాయి. రెండు సెజ్‌లలో సుమారు 220కి పైగా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. దీంతో ఒకప్పటి మారుమూల పల్లెటూరైన తడ నగరాలకు దీటుగా అభివృద్ధిలో దూసుకుపోతోంది. ఇప్పుడు రైల్వేశాఖ తనవంతు పాత్ర పోషించేందుకు సిద్ధమవుతోంది. తడ రైల్వేస్టేషన్‌లో ఒకప్పుడు ప్యాసింజర్ రైళ్లు ఆగేదే ఎక్కువ. సెజ్‌ల ఏర్పాటుతో 2010 నుంచి చెన్నై, సూళ్లూరుపేట మధ్య లోకల్ రైళ్లను ప్రవేశపెట్టారు. 2015లో అప్పటి కేంద్రమంత్రి వెంకయ్యానాయుడు చొరవతో ఇక్కడ నుంచి నేరుగా నెల్లూరుకు మెమూ రైళ్లను ప్రవేశపెట్టడంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ప్రస్తుతం నెల్లూరు, సూళ్లూరుపేట, చెన్నైకు 25 లోకల్ రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లోని పరిశ్రమల ఉత్పత్తులను రవాణా చేసేందుకు తడ రైల్వే స్టేషన్‌లోనే ఎగుమతుల కేంద్రానికి శ్రీసిటీ యాజమాన్యం ప్రయత్నాలు చేసింది. ఇప్పటికే కొబెల్‌కో పరిశ్రమ తయారు చేసే ఎక్స్‌కవేటర్లను గూడ్స్‌లలో రవాణా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గూడ్స్ షెడ్‌తో పాటు ఎగుమతుల కేంద్రాన్ని ఏర్పాటు చేసే దిశగా సదరన్ రైల్వే అధికారులు నిమగ్నమయ్యారు. ఇందుకోసం ఇప్పటికే రైల్వేశాఖ పరిధిలో ఉన్న భూములతో పాటు మరో 25 ఎకరాలు సేకరించేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లుగా తెలిసింది. దొరవారిసత్రం రైల్వేస్టేషన్ నుంచి బియ్యాన్ని వివిధ ప్రాంతాలకు సరఫరా చేసే పాయింట్‌ను సైతం తడకు తరలిస్తున్నారు. వీటితో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తడ రైల్వేస్టేషన్‌లో స్టాపింగ్ ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.

'శెట్టిపల్లె' లబ్ధిదారులకు త్వరలో ప్లాట్ల కేటాయింపు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ శెట్టిపల్లె లేఅవుట్ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇన్‌ఛార్జి జేసీ మౌర్య, తుడాచైర్మన్ దివాకర్‌రెడ్డి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తుడా భూసేకరణ అధికారి సుజన తదితరులతో ఆయన సమావేశమయ్యారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్, పార్కులు వంటి సదుపాయాలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వసతిగృహాలకు మరమ్మతులు పూర్తి చేయండి

జిల్లాలోని హాస్టళ్లలో మరమ్మతు పనులు వేగవంతంచేయాలని గురువారం జరిగిన సమీక్షలో అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంతలోపు విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఆయా శాఖల అధికారులు విక్రమ్ కుమార్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రాజా సోము, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నూతన పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలను నియమిస్తాం

జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు బీఎల్వోలను నియమిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. విజయవాడ నుంచి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్‌యాదవ్ గురువారం ఓటర్ మ్యాపింగ్, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమాలపై వర్చువల్ విధానంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎన్నికల అధికారులకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై శిక్షణా కార్యక్రమం ముగిసిందన్నారు. ఓటర్ మ్యాపింగ్ కూడా పూర్తికావచ్చిందని, బీఎల్వోలకు ఐడీ కార్డులను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు సుధారాణి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

● 20 దుంగలు స్వాధీనం

మంగళం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతంలో గురువారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఇద్దరుస్మగ్లర్లను అరెస్టు చేసి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరు సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానందకు చెందిన ఆర్ఎస్ఐ అల్లీబాషా బృందం, ఫారెస్టు బీట్ ఆఫీసర్ జాన్ శ్యాముల్‌తో కలిసి మామండూరు అటవీప్రాంతంలో బుధవారం నుంచి కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున కాకిరేవులపెంట వద్ద ఇద్దరు వ్యక్తులు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని గమనించి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకోగా.. మామండూరుకు చెందిన వారుగా గుర్తించారు. వారిని విచారించి.. దాచి ఉన్న 20 ఎర్రచందనం దుంగలను గుర్తించారు. వారితో పాటు దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌పై కేసు కొట్టేయడం శుభపరిణామం



న్యాయదేవత, సీఎం చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం

తిరుపతి(జీవకోన), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌పై గతంలో జగన్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసును కొట్టివేయడం శుభపరిణామమని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుబాబు, నగర అధ్యక్షుడు జేడబ్ల్యూ విజయకుమార్ అన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం వీరు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చేలా ఏపీ ఫైబర్ నెట్‌వర్క్‌ను చంద్రబాబు తీసుకొచ్చారన్నారు. ఈ ఫైబర్ నెట్ ద్వారా వేలాదిమంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందారన్నారు. దీనిని ఓర్వలేని జగన్ ప్రభుత్వం అక్రమ కేసును బనాయించడంతో వేలాది ఆపరేటర్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై పోరాటం చేయడంతో న్యాయస్థానం ఆ కేసును కొట్టేసిందన్నారు. ఏపీ ఫైబర్ నెట్‌కు పూర్వవైభవం వచ్చేలా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తారని మళ్లీవేలాది ఆపరేటర్ల కుటుంబాల్లో వెలుగులు నింపుతారన్నారు. ఈ సందర్భంగా న్యాయదేవత, చంద్రబాబు చిత్రాలకు పాలాభిషేకం చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నేతలు ఆనంద్, శంకర్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

జనవరిలో పలు ప్రధాన రైళ్లు రద్దు

విశాఖపట్నం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గోదావరి-రాజమండ్రి, రాజమండ్రి-కడియం సెక్షన్లలో ఆధునికీకరణ నిర్మాణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జనవరిలో పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని వాల్తేరు సీనియర్ డీసీఎం కె.పవన్ కుమార్ తెలిపారు. జనవరి 27న తిరుపతి-పూరి ఎక్స్‌ప్రెస్ (17480), 28న పూరి-తిరుపతి (17479), తిరుపతి-విశాఖ డబుల్ డెక్కర్ (22708); 28, 29 తేదీల్లో విశాఖ-లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805), మచిలీపట్నం-విశాఖ ఎక్స్‌ప్రెస్ (17219); 29న విశాఖ-తిరుపతి డబుల్ డెక్కర్ (22707), 29, 30 తేదీల్లో లింగంపల్లి-విశాఖ జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12806), విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ (17220), 28, 30 తేదీల్లో గుంటూరు-విశాఖ సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17239), 29, 31 తేదీల్లో విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12718), విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ (17240), రాజమండ్రి-విశాఖ మెము పాసింజర్ (67285), విశాఖ-రాజమండ్రి మెము పాసింజర్ (67286), జనవరి 31న గుంటూరు-విశాఖ డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22876), విశాఖ-గుంటూరు డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్ (22575) రద్దు కానున్నట్టు పేర్కొన్నారు.

రైల్వే డివిజన్ కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తా

● సాధన సమితి సభ్యులతో కలెక్టర్



తిరుపతి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి బాలాజీ రైల్వే డివిజన్ ఆవశ్యకతను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బాలాజి రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాగా, జనవరిలో సీఎం నారావారిపల్లెకు వస్తున్నారని, ఆయన్ను కలిసే అవకాశం కల్పిస్తానని కలెక్టర్ వారితో చెప్పారు. నగరి, పుత్తూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాలను కూడా కొత్తగా ఏర్పడే సౌత్ కోస్తా రైల్వేలో కలిపితే బాగుంటుందని కమిటీ సభ్యులు తెలుపగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అలాగే, మాజీ ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సమావేశంలో సాధన కమిటీ కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్, సభ్యులు ఎమ్.వేణుగోపాల్ రెడ్డి, సూరినేని బుజ్జి బాబు నాయుడు, సికృష్ణయ్య, అనిల్ కుమార్, నీలేష్, కుమార్, టీవీ రావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం, అభివృద్ధే ఎన్డీఏ లక్ష్యం


రైతులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

చిల్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తిక్కవరం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఇంటింటికీ తిరిగి ఎన్డీఏ ప్రభుత్వం రైతుల కోసం అమలు పరుస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సతీష్‌రెడ్డి, లింగారెడ్డి, ప్రభాకర్, కుమార్, వీఆర్వో శ్రీనివాసులు, కార్యదర్శి సుభాషిణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పారా క్రీడాపోటీలకు ఎంపిక


అన్వేష్‌ను అభినందిస్తున్న నిర్వాహకులు

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి పారా క్రీడా పోటీలలో గూడూరుకు చెందిన పారా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు గురువారం ఎంపికయ్యారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నిర్వహించిన జిల్లాస్థాయి పారా క్రీడాపోటీలలో షటిల్ బ్యాడ్మింటన్, షాట్‌పుట్ విభాగాల్లో గూడూరుకు చెందిన పారా క్రీడాకారులు అన్వేష్, ప్రకాష్‌లు ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చేనెల 2వ తేదీన గుంటూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారు.

పారా బేసిక్ కోర్సులో చరణ్ ప్రతిభ


చరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రవీణాకుమారి

నాయుడుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆగ్రాలో జరుగుతున్న ఎన్‌సీసీ విద్యార్థుల పారా బేసిక్ కోర్సులో ప్రతిభ చూపిన నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి కంటేపల్లి చరణ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణా కుమారి గురువారం కళాశాలలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థుల పారా బేసిక్ కోర్సుకు రాష్ట్రం నుంచి చరణ్ ఒక్కడే ఎంపికయ్యాడని తెలియజేశారు. నవంబరు 4 నుంచి 25 వరకు 23 రోజులపాటు మిలిటరీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ దళాలతో పోటీపడి శిక్షణలో విజయవంతంగా సర్టిఫికెట్లు, జ్ఞాపిక షీల్డ్‌ను కైవసుకున్నాడని అభినందించారు. అలాగే ఎన్‌సీసీ కెప్టెన్ శివారెడ్డి, అధ్యాపక సిబ్బంది కూడా అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి


నెలవలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న రఫీ, ప్రవీణ్ తదితరులు

నాయుడుపేట, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి) : కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ప్రజారంజకపాలన సాగుతోందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నెలవల జన్మదినం సందర్భంగా ఆయనను టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గజమాలలు, శాలు వాలతో సత్కరించారు. అందరినడుమ నెలవల సుబ్రహ్మ ణ్యం కేక్‌కట్ చేశారు. నెలవలను సత్కరించిన వారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, పోలేరమ్మ ఆలయ చైర్మన్ నానాబాల సుబ్బా రావు, కట్టా రమణారెడ్డి, పసల గంగాప్రసాద్, జీవీఆర్ నాయుడు, అవధానం సుధీర్, గూడూరు కిషోర్‌కుమార్ ఉన్నారు.

పుత్తూరు వార్తలు

భూపతి మృతి టీడీపీకి తీరని లోటు


భూపతి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న షణ్ముగరెడ్డి

పుత్తూరు అర్బన్, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతి మృతి చెందడం బాధాకరణమని, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ షణ్ముగరెడ్డి సంతాపం ప్రకటించారు. . ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అని పేర్కొన్నారు. గురువారం కుప్పం నియోజకవర్గంలోని విర్నమల గ్రామంలోని భూపతి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు


అవగాహన సదస్సులో డాక్టర్ రమేష్

పుత్తూరు,నవంబరు27(ఆంధ్రజ్యోతి):స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సీటీఆర్ నెత్తం గ్రామంలో ఎయిడ్స్ వ్యాధిపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అక్రమ సంబంధాలు, కలుషిత రక్తమార్పిడి, వ్యాధిగ్రస్తుడు వాడిన బ్లేడ్లు, సిరంజిలను మరొకరు వాడినా, తల్లి నుండి శిశువుకు ఎయిడ్స్ వ్యాధి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపకులు శ్రీనివాసులు, బాబురావులు పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ


సంతకాల కార్యక్రమంలో గ్రామస్తులతో రోజా

పుత్తూరు,నవంబరు27(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో గురువారం గొల్లపల్లి గ్రామంలో సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు ఫీజుల భారంతో వైద్య విద్య దూరం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అన్నా లోకనాథం, దేవేంద్రరెడ్డి, గోవిందస్వామిరెడ్డి, మునస్వామిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

పచ్చదనం పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో నారాయణ

బాలాయపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం- పరిశుభ్రతపై వీవోఏలు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీవో నారాయణ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ భవనంలో వీవోఏలకు 2030 నాటికి గ్రామ పంచాయతీలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో భాగమైన థీమ్ 5పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీవోఏలు తమ గ్రామాల్లో పరిశుభ్రత పచ్చదనం అంశంపై ప్రజలకు అవగాహన కల్పించి గ్రామాలు పరిశుభ్రత పచ్చదనంతో ఉండేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ వినీల్ కుమార్, ఏపీఎం కిరణ్ పాల్గొన్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : సీఐటీయూ


ఆస్పత్రి వద్ద చేపట్టిన ధర్నా

వెంకటగిరి, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): సోమని టైల్స్ కంపెనీలో బుధవారం గ్యాస్ ట్యాంకర్ పేలుడు ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి, గాయపడిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల పరిహారం కంపెనీ చెల్లించాలని సీఐటీయూ నాయకులు చెంగయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదానికి కారణమైన కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పరిహారం చెల్లించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు మోడల్ స్కూల్ విద్యార్థి


చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ తులసీజ్యోతి

వెంకటగిరిటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి కే.చంద్రశేఖర్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి అన్నారు. గురువారం పాఠశాల్లో విద్యార్థిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 800 మీటర్ల పరుగు పోటీల్లో మొదటి స్థానం, 1500 మీటర్ల పరుగు పోటీల్లో రెండవ స్థానం సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకు వచ్చాడని తెలియజేశారు. విద్యార్థులు విద్యతో పాటు, ఆటల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. చంద్రశేఖర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయం

పెళ్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్వాయిపాడు గోమతి సర్కిల్ నుంచి నెలుబల్లి వరకు గల సుమారు 20 కిలోమీటర్ల 71వ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ఎస్ఐ నాగరాజు నడుంబిగించారు. ప్రతి రోజూ జాతీయ రహదారిపై పర్యటిస్తూ వాహనాలు నడిపే డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మనపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా వాహనాలను నడపాలన్నారు. లైసెన్సులు, వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకున్నా, మద్యం సేవించి వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైల్వేగేటు మూసివేత


రైల్వేగేటు కు చేస్తున్న మరమ్మతులు

సూళ్లూరుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని కచ్చేరివీధిలో ఉన్న రైల్వేగేటును గురువారం మూసివేశారు. రైల్వేగేటు వద్ద ఎస్‌సీ-60 మరమ్మతుల కారణంగా రెండు రోజుల పాటు మూసివేసి పనులు చేయనున్నారు. మళ్లీ శుక్రవారం రాత్రి 11 గంటలకు రైల్వేగేటును యథావిధిగా తెరవనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. పట్టణ నడిబొడ్డులో ఉన్న ప్రధాన రైల్వేగేటు కావడంతో ద్విచక్ర వాహన దారులకు ఇబ్బందులు తప్పలేదు. రైల్వేగేటు మూసి వేయడంతో గేటుకు అవతలి వైపు వాహనదారులు జీఎన్‌టీ రోడ్డు మీదుగా వెళ్లి శ్రీహరికోటకు వెళ్లే ప్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా వారి ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది.

సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలి


సైన్స్ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేసి అభినందిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకుని భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ చెకుముకి పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ జేవీవీ ఆధ్వర్యంలో సమాజంలో మూఢనమ్మకాలను పోగొట్టేందుకు అనేక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అలాగే విద్యార్థులకు సైన్స్ పరీ క్షలు నిర్వహిస్తూ వారిని సైన్స్ పట్ల ప్రోత్సహించేలా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహనను పెంచుకోవాలన్నారు. చదువుల ద్వారానే ఉజ్వలభవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, రజినీకాంత్, శ్రీనివాసాచారి, ఇబ్రహీం, సురేష్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై మాక్‌డ్రిల్


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలలో హఠాత్తుగా ప్రమాదాలు జరిగినపుడు కార్మికులను ప్రాణాలతో కాపాడేందుకు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించామని తహసీల్దారు ప్రసాద్ అన్నా రు. గురువారం మండలంలోని మంగళపూరు సమీపంలోని కలర్‌షైన్ పరిశ్రమలో ఏపీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ లిక్విడ్, హైలిక్విడ్ ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సి జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించామన్నారు. ఈ కార్య క్రమంలో కిరణ్‌కుమార్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, పరిశ్రమ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ మేథపై విద్యార్థులు పట్టు సాధించాలి


శిక్షణా తరుగతుల్లో విద్యార్థులు

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిశంకర డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో గురువారం బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఐబీఎస్ స్కిల్స్ బిల్డ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఫండమెంటల్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ వీఎస్ఎస్ కుమార్ మాట్లా డుతూ విద్యార్థులు నేటి సాంకేతిక ప్రపంచంలో రాణించాలంటే కృత్రిమ మేథపై పట్టుసాధించాలన్నారు. ఆ మేరకు విద్యార్థులకు శిక్షణా తరగతులను నిర్వహించామన్నారు. ఇది వారి భవిష్యత్ ఆలోచనలకు దోహదం చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజయ్య, డాక్టర్ వేణుమాధవ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు గూడూరు క్రీడాకారులు


క్రీడాకారులను అభినందిస్తున్న హాకీ కోచ్ దీపక్‌ఆకాష్

గూడూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి హాకీ పోటీలకు గూడూరు క్రీడాకారులు ఎంపికయ్యారని శాప్ హాకీ కోచ్ దీపక్‌ఆకాష్ తెలియజేశారు. గురువారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రాష్ట్రస్థాయి హాకీ క్రీడాపోటీలలో ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కోచ్ దీపక్ ఆకాష్ మాట్లాడుతూ ఇటీవల చంద్రగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 విభాగంలో నతన్‌ఆకాష్, గురువరప్రసాద్, అనకాపల్లిలో జరిగిన అండర్-19 పోటీలలో యశ్వంత్, భువనేష్ ప్రతిభచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. త్వరలో మధ్యప్రదేశ్‌లో జరగనున్న అండర్-14, ఒడిశాలో జరగనున్న అండర్-19 జాతీయస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని ఆయన వివరించారు.

ఎట్టకేలకు రహదారిపై చెత్త తరలింపు



ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తరలిస్తున్న పంచాయతీ అధికారులు

తడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు అధికారులు స్పందించారు. చెత్త తరలింపు చర్యలు తీసుకున్నారు. స్థానిక బోడిలింగాలపాడు శివాలయం సమీపంలో జాతీయ రహదారిపై పంచాయతీ అధికారులే రోడ్లపైనే చెత్త వేస్తున్నా రంటూ బుధవారం ఇదేంచెత్తపని అంటూ ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన సంగతి తెలిసిందే. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో పంచా యతీ అధికారులు స్పందించారు. గురువారం రెండు ఎక్స్‌కవేటర్లు, మూడు ట్రాక్టర్ల సాయంతో ఆ చెత్తను వెనుకవైపునకు తరలిస్తున్నారు. దీనిపై ఎంపీడీవో శేఖర్‌నాయక్ మాట్లాడుతూ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ద్వారా రోడ్డుపై చెత్తవేయడంపై చర్యలు తీసుకున్నామన్నారు. అయితే కొన్ని పరిశ్రమలు, హోటళ్లు, అపార్ట్‌మెంట్‌లు చెత్తను రాత్రి సమయాలలో ఇక్కడ పడవేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో ఇక్కడ నిఘా పెడుతున్నామన్నారు. మొదటిసారి చెత్తవేస్తూ పట్టుబడితే రూ.50వేల వరకు జరిమాన విధిస్తామని, రెండోసారి పట్టుబడితే రూ.లక్ష వరకు జరిమాన విధిస్తామని స్పష్టం చేశారు. మూడోసారి పట్టుబడితే వాహనాన్ని సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఇక్కడ చెత్తవేయకుండా అందరూ సహకరించాలని ఆయన కోరారు.

రైతును రాజులా చూడాలన్నదే ఎన్డీఏ లక్ష్యం


రైతులకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిరైతును రాజులా చూడాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని బూదనం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతుల ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల సాగుకు పెట్టుబడిని ప్రతిఏడాదీ మూడు విడతల్లో నగదును అందజేస్తూ తోడ్పాటు అందిస్తోందన్నారు. ఇప్పటికే రెండు విడతల్లో రైతుల ఖాతాల్లో నగదును జమ చేశామన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సీఎం చంద్రబాబు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు రాజ శేఖర్‌రెడ్డి, రామచంద్రారావు, గుండాల లీలావతి, కోట సతీష్‌యాదవ్, చిట్టేటి కీర వాణి, పెనుబోలు జానకిరామిరెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో ఆరోగ్యం


రైతులకు అవహన కల్పిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

పెళ్లకూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో రసాయనక ఎరువుల వినియోగంతో జీవరాశులు నశించి పోవడమే కాకుండా, పర్యావరణం కలుషితమై ఆహార పదార్థాలు విషతుల్యం అవ్వడంతో ప్రజలు అనేకరోగాల బారిన పడుతారని నాయుడుపేట వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తూరు గ్రామంలో ఏడీఏ నాగార్జునసాగర్, మండల వ్యవసాయాధికారి విజయభారతి నానో యూరియాను వినియోగించేలా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా రైతుల్లో మార్పు రావాలని పేర్కొన్నారు. 500 ఎంల్ నానో యూరియా బాటిల్ ఒక 45 కిలోల యూరియా బస్తాతో సమానమన్నారు. నానో యూరియా వినియోగంతో పెట్టుబడులు తగ్గి రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందన్నారు. ముఖ్యంగా వరి సాగులో వస్తున్న శాస్త్రీయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

● ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ


మహిళా రైతుకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

తడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండల పరిధిలోని చేనిగుంట గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె చేపట్టారు. రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఎప్పటికప్పుడు పెట్టుబడి సాయం 20వేలు అందజేస్తోందన్నారు. యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించిన రెండు రోజుల్లోనే ప్రభుత్వం నగదు జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, పళణి, సుదర్శన్, నీలకంఠం, సుధాకర్, జయపాల్, బీజేపీ నాయకులు తేజారెడ్డి, కృష్ణమూర్తి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

నాయుడుపేట టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట తహసీల్దారు కార్యాలయ ప్రాంగణంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వివరించారు. ఈ అర్జీలో ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరు, సంబంధిత పత్రాలను జతచేసి ఇవ్వాలన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న సూపరిటెండెంట్ డాక్టర్ అమర్‌నాథ్

నాయుడుపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాంతకమైన ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అమర్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం నవజీవన్ ఆర్గనైజేషన్ ఐఈసీ స్టాల్ ద్వారా ప్రజలకు ఎయిడ్స్ లక్షణాలు, వ్యాధికి కారణాలు, నిరోధక జాగ్రత్తల గురించి వివరించారు. డ్రగ్స్ వాడకంవల్ల కలిగే ఇబ్బందులు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ ప్రాజెక్టు మేనేజర్ బాలాజీరాజు, ప్రోహిబిషన్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ భాస్కర్‌రాజు ఉన్నారు.

డీవీసత్రంలో నెలవల జన్మదిన వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

దొరవారిసత్రం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం జన్మదిన వేడుకలను గురువారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కార్యాలయం ఎదుట కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారధి, వంకా సుధాకర్, రమణయ్య, సొసైటీ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఉదయ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, మునిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

గూడూరు యువకుడు హైదరాబాద్‌లో మృతి


ఆకాష్ (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరా బాదులో జరిగిన రోడ్డు ప్రమా దంలో గూడూరు ప్రాంతానికి చెందిన యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు... స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన ఆకాష్ (25) హైదరాబాదులో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారం రోజుల క్రితం హైదరా బాదులో ఆకాష్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గురువారం గూడూరుకు తీసుకు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తిలక్ నగర్‌లో విషాద ఛాయలు అలముకున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వివక్ష : సీపీఐ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

బాలాయపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా వివక్ష , అసమానతలు కొనసాగుతున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. గురువారం మండలంలోని హస్తకావేరి గ్రామంలోపార్టీ సభ్యుల క్షేత్రస్థాయి రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పేదల సంక్షేమం పట్టడం లేదన్నారు. కార్పొరేట్లకు సేవ చేయడ మే ధ్యేయంగా పాలకులు పనిచేస్తున్నారని విమర్శించారు. సీపీఐ తొలి నుంచి రైతులు, విద్యార్థులు, పేదల పక్షాన పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ అధ్యక్షులు బాలక్రిష్ణ, మండల అధ్యక్షులు మునిక్రిష్ణారెడ్డి, బలరామ నాయుడు, మస్తానయ్య, హేమచంద్ర పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కలశ ప్రతిష్ఠ, వినాయక పూజల కలశ పూజ వైదిక కతృవులు నిర్వహించాక వైభవంగా అభిషేకం నిర్వహించారు. విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి భవన పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు భారతి, ఎంపీడీవో సురేంద్రనాథ్, మునిరాజానాయుడు

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయం మార్పే క్రమంలో గురువారం అధికారులు, టీడీపీ నాయకులు భవన పరిశీలన చేశారు. ఇటీవల తహసీల్దారు భవనాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించి మార్పు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో గురువారం కార్యాలయ సమీపంలోని ఓ భవనాన్ని పరిశీలించారు. తహసీల్దారు భారతి, ఎంపీడీవో సురేంద్రనాథ్, టీడీపీ మండలాధ్యక్షులు రావిళ్ల మునిరాజానాయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న భవానీప్రసాద్,వివిధ శాఖల అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని పురపాలకసంఘ కమిషనర్ భవానీ ప్రసాద్ అన్నారు. గురువారం పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ, ప్రగతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహ ముక్త భారత్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వలన ఆడపిల్లలకు జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలయ్య, భారతి, డిప్యూటీ తహసీల్దారు అనిల్, చందమామల కోటయ్య, ప్రగతి జిల్లా కోర్డినేటర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

ఓంశక్తి ఆలయంలో ఘనంగా కుంభాభిషేకం



కేవీబీపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రలోని ఓంశక్తి ఆ ఆలయంలో గురువారం కుంభాభిషేకం నిర్వహించారు. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో యజ్ఞ, యాగాదులను చేశారు. ఆలయానికి నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వాహణాధికారి రామకృష్ణారెడ్డి తెలిపారు. **పిచ్చాటూరు:** కీళపూడిలోని ఓం శక్తి అమ్మవారి దేవాలయంలో మహా కుంభాభిషేకం నిర్వహించారు. వేదపండతులు శాస్త్రోక్తంగా అమ్మవారి కుంభాభిషేక మహోత్సవాన్ని, కలశాభిషేకం నిర్వహించారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘ సభ్యులు

ఏర్పేడు, నవంబరు 27(ఆంధ్ర జ్యోతి): లింగ వివక్షతను రూపుమాపాలని ఏపీఎం ఆదినారాయణ అన్నారు. ఏర్పేడు మండల కేంద్రంలో గురువారం మహిళా సంఘాలతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంయుక్తంగా ఎన్ఆర్ఎల్ఎం నయీ చేతన 4.0 జెండర్ ఆధారిత వివక్షతకు వ్యతిరేకంగా నాలుగు వారాల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంనుంచి బజారు వరకు ర్యాలీ చేపట్టిప్రజలకు అవగాహన కల్పించారు. ఏపీఎం, సీసీ, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



రేణిగుంట నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): ఎల్లమండ్యం పంచాయతీ కొత్తపాల్యంలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. సర్వే నెంబర్ 187/11,189/1లో నిర్మించిన నిర్మాణాలను తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందితో కలిసి నిర్మాణాలు కూల్చివేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మూడేళ్ల క్రితం ప్రభుత్వ భూమిలో నివాసాలను నిర్మించుకుని,హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో ఇన్నాళ్లూ మిన్నకుండిపోయామన్నారు, కోర్టు ఆదేశాల మేరకు విచారించామన్నారు. ఫోర్జరీ పట్టాలను అడ్డుపెట్టుకొని నిర్మాణాలు చేపట్టారని గుర్తించామన్నారు. రెండుసార్లు నోటీసులు జారీ చేశాక అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్నామని వివరించారు

ప్రభుత్వ భూమిలో కంచె తొలగింపు

ప్రభుత్వ భూమిలో కొందరు వేసిన కంచెను రెవెన్యూ అధికారులు గురువారం తొలగించారు. కొత్తపాల్యం పరిధిలోని సర్వేనెంబర్ 120/2లో ఉన్న ప్రభుత్వ భూమిలో కొందరు కంచె వేస్తున్నారని సమాచారం తెలుసుకున్న వీఆర్వో నళిని వెళ్లి అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అక్రమదారులు పట్టించుకోపోవడంతో ఆమె అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ భూమిలో వేసిన కంచెను తొలగింపజేశారు.

పచ్చిరొట్ట పంటతో భూసారం వృద్ధి



మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణారావు

ఏర్పేడు, నవంబరు 27(ఆంధ్ర జ్యోతి): పచ్చిరొట్ట పంటతో భూసారాన్ని పెంచుకోవాలని ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ రామకృష్ణారావు రైతులకు సూచించారు. అంజిమేడు, పాతవీరాపురం, ఇసుకతాగేలి గ్రామాల్లో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ఏఈవో సాగరిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. జిల్లా ఏరువాక కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్టు, కోఆర్డినేటర్ రామకృష్ణారావు రైతులకు సూచనలు, సలహాలను అందజేశారు. ఎకరాకు 300 కేజీల యూరియాను వేయడం వల్ల తెగుళ్ల ఆశించే అవకాశంఉందన్నారు. వంద కేజీలన మూడు దఫాలుగా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

సత్యవేడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): దళవాయి అగ్రహారం మెయిన్ స్కూళ్లలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం తీరును ఎంఈవో రవి గురువారం పరిశీలించారు. పిల్లలకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. భోజన నాణ్యత లో రాజీ పడొద్దన్నారు. పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు చెంచులక్ష్మమ్మకు పలు సూచనలు ఇచ్చారు.

ఎంపీ రమేష్ తల్లికి సుధీర్ నివాళి



రత్నమ్మ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ తల్లి రత్నమ్మ మృతికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంతాపం ప్ర కటించారు. ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గురువారం పొట్లదుర్తిలో జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



సుధాకర్ మృతదేహం

కేవీబీపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కా ట్రపల్లి గిరిజనకాలనీకి చెందిన సుధాకర్ (31) అప్పుల బాధతో ఆ త్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలిలా.. సుధాకర్, అతని భార్య సుగుణ కూలి పనులపై ఆధారపడి బతుకుతున్నారు. వీరికి నలుగురు సంతానం. ఆర్థిక పరిస్థితి సరిగా లేక సుధాకర్ అప్పులు చేశాడు. అప్పులు తీర్చేమార్గం లేక బుధవారం రాత్రి ఇంట్లో ఉన్న విష గుళికలు తిని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. భార్య సుగుణ వెంలనే 108 వాహనం ద్వారా శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుధాకర్ మృతిచెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యవసాయ మోటార్ స్టార్టర్ల చోరీ

నారాయణవనం, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): అరణ్యం కండ్రిగ నుంచి పాలమంగళం ఉత్తరం వరకు అరుణానది సమీపంలో వ్యవసాయ మోటార్ స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. బాధిత రైతులు ఈమేరకు గురువారం పోలీసులకు పిర్యాదు చేశారు. రాత్రి వేళ దొంగలు సుమారు వందకు పైగా మోటార్ స్టార్టర్లు చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మోటార్లకు అమర్చిన వాటిని విడదీసి ఎత్తుకుపోయినట్లు రైతులు వాపోయారు. కొందరు ముఠాగా ఏర్పడి వీటిని చోరీచేశారని రైతులు భావిస్తున్నారు. రాత్రి వేళ పోలీసుల గస్తీ పెంచాలని, వ్యవసాయ మోటార్ల వద్ద సీసీ కెమెరాలు, అలారం సిస్టమ్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం, విద్యుత్ శాఖ సహకరించాలని రైతులు కోరుతున్నారు.

కృష్ణాపురంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు



శిబిరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీలత

నాగలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం గ్రామంలో గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం జరిగింది. దీనిని వారం రోజుల పాటు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో బాబయ్య హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వేలాయుధం, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సత్యవేడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మాస్టర్ స్కూలు విద్యార్థిని ఇషాంక బ్రాంచ్ మెడల్ సాధించింది. రాజమహేంద్రవరంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ విద్యార్థిని తృతీయ స్థానాన్ని సాధించినట్టు స్థానిక కరాటే శిక్షకులు భువనేశ్వర్ తెలిపారు. ఈమెను స్థానిక మాస్టర్ స్కూలు అధినేత శ్రీనివాసులురెడ్డి గురువారం అభినందించారు.

జాతీయ కరాటే పోటీలకు ఎంపిక



తనూహ్య

వరదయ్యపాళెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పాండూరు జడ్పీ హైస్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థిని తనూహ్య జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. రాజమండ్రిలో జరిగిన అండర్-17,32 కేజీల విభాగంలో తనూహ్య ఉత్తమ ప్రతిభకనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని కోచ్ కన్నయ్య తెలిపారు. ఈమెను ప్రధానోపాధ్యాయులు ముని సుబ్రహ్మణ్యం, ఇతర ఉపాధ్యాయులు అభినంద నందించారు.

శ్రీకాళహస్తిలో నేడు ప్రజా దర్బార్

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు గురువారం ఓప్రకటన తెలిపాయి. ఉదయం 9-30గంటలకు ప్రజా దర్బార్ జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముంపు బాధితులకు టేబుల్ ఫ్యాన్ల వితరణ



ఫ్యాన్ల పత్రాలను కలెక్టర్‌కు అందజేస్తున్న ఇసుజు ప్రతినిధులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం రాయలచెరువు ఘటనలో ముంపునకు గురైన కళత్తూరు, రాజులకండ్రిగ, పాతపాళెం బాధితులకు ఇసుజు మోటార్స్ కంపెనీ వంద టేబుల్ ఫ్యాన్లను వితరణ చేసింది. వీటిని కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు. ఆయన వారిని అభినందించారు.

అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం కృషి



రైతుకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న శంకరర్‌రెడ్డి, నరసింహయాదవ్ తదితరులు

కేవీబీపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతును రాజుచేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నియోజకవర్గ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి అన్నారు. ఈక్రమంలోనే రైతులకు విత్తనాలు, ఎరువులు,సాగునీరు అందిస్తోందని చెప్పారు. అంజూరులో గురువారం రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వర్షాలకు చెరువులు నిండి నీటి ఇబ్బంది తీరిందన్నారు. ఉద్యాన పంటలను పండించాలని , ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టి రసాయనిక ఎరువులను తగ్గించి లాభం పొందాలని సూచించారు. ఇంటింటికి రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, రామాంజులనాయుడు, గోపీనాథ్ రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, కేశవులునాయుడు, గోపి సుధాకర్, ప్రకాష్‌నాయుడు, సురేష్‌రెడ్డి, వెంకటకృష్ణయ్య పాల్గొన్నారు.

రెండో రోజూ ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్ఎంయూ నాయకులు

సత్యవేడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అక్రమ సస్పెన్షన్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ సత్యవేడులో ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఎన్ఎంయూ నాయకులు చేపట్టిన నిరసన రెండో రోజు కూడా కొనసాగింది. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట అసోసియేషన్ అధ్యక్షుడు పార్థసారధి ఆధ్వర్యంలో పలువురు ఎన్ఎంయూఏ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకుడు వి.బాబు మాట్లాడుతూ ఉద్యోగులపై పెడుతున్న అక్రమ చార్జ్‌షీట్లను రద్దుచేయడంతో పాటు 1/2019కి లోబడి నిర్ణయాలు చేయాలన్నారు. ఆర్టీసీ సంస్థలో ఏడాదికాడాది అనేక మంది ఉద్యోగులు రిటైర్డ్ అవుతున్న అందుకు తగ్గట్టు నియామకాలు లేవన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ స్టేట్ సెక్రటరీ చెంచులయ్య, స్థానిక డిపో చైర్మన్ సుధాకర్, అసోసియేషన్ సెక్రటరీ శేఖర్, కేయూ సుధాకర్, నరేష్, కె.ఎస్.రాజు, ప్రకాష్, ఎన్.కె.నాథ్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణపై గిరిజనుల ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

సత్యవేడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పీవీపురం పంచాయతీ చమర్త కండ్రిగలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని రక్షించి ఇల్లు లేని వారికి స్థలాలుగా ఇవ్వాలని ఇక్కడి గిరిజనులు కోరారు. వారు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెం.375,376లలో సుమారు నాలుగెకరాల ప్రభుత్వ భూమికి కొంతమంది భూస్వాములు స్థానిక ఆక్రమణదారులతో కలసి నకిలీ పాసు పుస్తకాలు సృష్టించుకున్నారని ఆరోపించారు. ఆక్రమణలను తొలగించి స్థలాలు లేని గిరిజనులకు కేటాయించాలని తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించారు.

వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రెండు మండలాలను కలిపే ద్వారకానగర్ వంతెన నిర్మాణంతో ప్రజల చిరకాల స్వప్నం సాకారం కానుందని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. నాగలాపురం సమీపంలో రూ.800 కోట్లు నిధులతో చేపట్టనున్న ద్వారకానగర్ వంతెన నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వంతెన పూర్తయితే 50 గ్రామాల ప్రజలకు రాకపోకలు సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అరుణానదిలో వరదల సమస్యకు ప్రభుత్వం రూ.8 కోట్లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



మహిజను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని అమరావతిలో విద్యార్థుల మాక్ అసెంబ్లీలో ప్రతిభ కనబరిచిన మహిజను పాఠశాల వర్గాలు గురువారం అభినందించాయి. ఈ విద్యార్థినిది తొట్టంబేడు మండలం బోనుపల్లి గ్రామం.

పోగొట్టుకున్న పర్సు అందజేత



భక్తునికి పర్సు అందజేస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, నవంబరు 27 (ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోగొట్టుకున్న పర్సును భక్తునికి తిరిగి అప్పగించారు. ముంబయికి చెందిన యోగేష్ దిలీప్ అనే భక్తుడు గురువారం దర్శనానికి వచ్చి పర్సును పోగొట్టుకున్నాడు. గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది పర్సును ఎస్పీఎఫ్ సిబ్బందికి అందజేశారు. వారు పర్సును తనిఖీ చేయగా రూ.60వేలు నగదు, ఆధార్‌కార్డు లభించాయి. వారు మైక్‌లో చేసిన ప్రకటన విని చేరుకున్న భక్తుడికి వివరాలు సరిచూసుకుని పర్సును అందజేశారు.

శివసేవకుడికి అభినందన

నాగలాపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయంలో సేవలందిస్తున్న భక్తుడిని గురువారం ఆలయ పాలకమండలి సభ్యుడు శ్రీనివాసులు నాయుడు అభినందించారు. సురుటుపల్లి గ్రామానికి ఆర్ముగం అనే వ్యక్తి గత రెండేళ్లుగా రోజూ తన విధులను ముగిశాక ఆలయ ఆవరణను శుభ్రపర్చుతున్నాడు. గమనించిన పాలకమండలి సభ్యులు అభినందించారు.

వైసీపీ నేత పరామర్శ

వరదయ్యపాళెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌నగర్‌లో మాతృవియోగంతో బాధపడుతున్న వైసీపీ రాష్ట్ర ముస్లిం మైనారిటీ సభ్యుడు షేక్ అబ్దుల్‌ని నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పరామర్శించారు. కుటుంబానికి వైసీపీ పార్టీ అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఆయనతో పాటు మండల కన్వీనర్ నాయుడు, దయాకర్ రెడ్డి, వినోద్ యాదవ్, మురళీరెడ్డి, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

గంగమ్మగుడికి భూమిపూజ

తిరుపతి అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మంగళం వెంకటేశ్వరకాలనీలో గంగమ్మగుడి నిర్మాణానికి ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం భూమిపూజ చేశారు. గుడి నిర్మాణానికి తనవంతు సాయం అందిస్తానన్నారు. ఉమ్మడి మంగళం పంచాయతీలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



చిన్నారులకు ఆర్థిక చేస్తున్న 108 సిబ్బంది

కేవీబీపురం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 108లో పని చేస్తే ఇటీవల మృతి చెందిన సదాశివపురం గ్రామానికి చెందిన రేవతి కుటుంబానికి ఆమె సహోద్యోగులు సాయమందించారు. 108 సిబ్బంది, జిల్లా సిబ్బంది, యాజమాన్యం కలిసి రూ.91,500 అందించారు. చిన్నారుల పేరున ఈసొమ్ము డిపాజిట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో 108 రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మహేష్, సునీల్, మునిరాజా, కేశవులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



యూరియా పంపిణీ ప్రక్రియలో పాల్గొన్న నందకిషోర్

వరదయ్యపాళెం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కదూరులో రైతులకు యూరియా అందజేసేందుకు పీఏసీఎస్ చైర్మన్ నందకిషోర్ చర్యలు చేపట్టారు. ఈక్రమంలో గురువారం యూరియాను పంపిణీ చేశారు. డీసీఎంఎస్ సభ్యుడు గుత్తి త్యాగరాజు కార్యక్రమాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రామాలయ కుంభాభిషేకంలో ఎమ్మెల్యే

నారాయణవనం, నవంబర్ 27(ఆంధ్రజ్యోతి): కశిమిట్టలో కొత్తగా నిర్మించిన రామాలయం కుంభాబిషేక మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం గురువారం పాల్గొన్నారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ నిర్మాణ కమిటీ చొరవను అభినందించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

శ్రీకాళహస్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): (వాంపల్లికు చెందిన టీడీపీ నాయకుడు కొల్లూరు శివ గురువారం మృతి చెందాడు. ఎమ్మెల్యే బొజ్జల సుదీర్‌రెడ్డి, ఆయన సతీమణి రిషితారెడ్డి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులుఅర్పించారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ●టీడీపీ నాయకుడు భూపతి మరణం బాధాకరమని వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి అన్నారు. గురువారం రామకుప్పం మండలంలో భూపతి అంత్యక్రియలకు హాజరయ్యారు.